ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
కరీంనగర్ fb.com/vaartha Digital
Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-11-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 293 పేజీలు: 8+16 వెల: 6.50

ఇఎస్ఐ క్లెయిమ్‌లు ఇక సులభతరం 3
అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడి 5

3 నిబంధనలు సడలించిన కేంద్రం
మహిళా అగ్నివీర్‌లకు ప్రసూతి సెలవులు
25 % మంది శాశ్వత సైనికులుగా మార్పు

'అగ్నివీర్'లకూ పెళ్లిళ్లు



3 నేడు రాష్ట్రపతి ముర్ము ప్రధాని మోడీతో భేటీ
ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు

నేపాల్ ప్రధాని బాలేంద్రషా ఢిల్లీ రాక



డేటా సెంటర్ల హబ్‌గా తెలంగాణ

రాష్ట్రంలో తయారీ సామర్థ్యాల విస్తరణ
డిజిటైజేషన్, ఆటోమేషన్‌కు అపార అవకాశాలు
ప్యారిస్ పర్యటనలో ష్నైడర్ సంస్థకు డిసిఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త: ప్రపంచస్థాయి ఎనర్జీ టెక్నాలజీ సంస్థ ష్నైడర్ ఎలక్ట్రిక్ తెలంగాణలో తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. పారిస్‌లోని ష్నైడర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు గ్వెనెల్ హుయెట్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సునీల్ కుమార్ సింగ్‌తో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో డేటా సెంటర్ల రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న తీరును వివరించినట్లు తెలిపారు. డేటా సెంటర్ల అభివృద్ధికి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో విద్యుదీకరణ, డిజిటలైజేషన్, ఆటోమేషన్ రంగాల్లో సంస్థకు భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో తయారీ సామర్థ్యాలను విస్తరించుకోవాలని సూచించారు. భవిష్యత్తులోసంస్థ మొత్తం ఆదాయంలో 30 శాతానికి పైగా డేటా సెంటర్ల వ్యాపారం నుంచే వచ్చే అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో తెలంగాణలో తయారీ కేంద్రాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించుకోవ డానికి ఇదే సరైన సమయమని సూచించారు. ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థకు భారత కార్యకలాపాల్లో తెలంగాణ ప్రత్యేకమైన, వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగి >>2



సర్ ఓటుకు కాదు.. చేటుకే

కేంద్రం చేపట్టిన జన గణనలో ఒబిసి కులగణన చేర్చాలి
ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ. 30 వేలకోట్ల సాయం చేయాలి
కాంగ్రెస్ పిఎసి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి

7

కోటి ఓట్లు.. 90 సీట్లు

వచ్చే ఎన్నికల్లో ఖాయం



ఆదివారం పిసిసి కార్యవర్గ భేటీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి సందీప్. మంత్రి ఉత్తమ్

సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వస్తాం..
రాహుల్‌ను ప్రధాని చేసే బాధ్యత పార్టీ కార్యకర్తలదే..
కాంగ్రెస్‌కు సీట్లు పెరిగితే కేంద్రంలో అధికారం పక్కా
పిసిసి కార్యవర్గ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు22, ప్రభాతవార్త: 'మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది, కార్యకర్తలు అధికారంలోకి తెస్తారు. 3,700 నుంచి 92 లక్షల ఓట్లు తెచ్చిన కార్యకర్తలు మన దగ్గర ఉన్నారు.వచ్చే ఎన్నికల్లో కోటి ఓట్లతో 90 సీట్లు గెలుస్తాం' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వస్తాం, కరువును ఎదుర్కోవడానికి, పార్టీని బలోపేతం చేయడానికి అన్ని వ్యూహాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆదివారం గాంధీ భవన్‌లో తెలంగాణ పిసిసి కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'గతంలో టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ వరుసగా పదేళ్ల పాటు అధికారంలోకి వచ్చాయి, ఇప్పుడు వరుసగా పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది.రాహుల్ గాంధీని ప్రధానిని చేసే బాధ్యత తెలంగాణ కాంగ్రెస్ నేతలు భుజాన వేసుకోవాలి.ఇందిరా గాంధీ చివరి శ్వాస విడిచినప్పుడు మెదక్ ఎంపీగా ఉన్నారు, కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తెలంగాణ ఎప్పుడూ అండగా ఉంది.ఇప్పుడు కూడా రాహుల్ గాంధీకి అండగా ఉండాలి.కాంగ్రెస్ పార్టీ జెండాను మోసి రాహుల్ గాంధీని ప్రధానిని చేద్దాం' అని పేర్కొన్నారు. 'పీసీసీ అధ్యక్షుడిగా నేను బాధ్యతలు చేపట్టిన సమయంలో >>2

మంచి మైకులో.. చెడు చెవిలో చెప్పాలి

పార్టీకి నష్టం చేసే వారిపై చర్యలే
ఈ ఒక్కసారికే వదిలేస్తాం: సిఎం రేవంత్ వార్నింగ్

2



బిజెపి చీఫ్ నితిన్ నబీన్ నేడు రాక

కరీంనగర్‌లో మహా పాదయాత్రకు హాజరు

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ సోమవారం కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు నితిన్ నబీన్ కరీంనగర్ విచ్చేసున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ >>2

కొత్త వాహనాలకు హై సెక్యూరిటీ ప్లేటు తప్పనిసరి

హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త: రాష్ట్రంలో డీలర్ల వద్ద కొనుగోలు చేసిన నూతన వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించినప్పటికీ,



హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చడంలో నిరక్ష్యాన్ని వహిస్తున్న నేపథ్యంలో రవాణా శాఖ అప్రమ్తమైంది. కొత్తవాహనాలకు హై సెక్యూరిటీ ప్లేట్లను అమర్చని డీలర్లపై కఠినచర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ప్లేట్లు అమర్చకపోవడంతో పాటు, ఆ వివరాలను వాహన్ పోర్టల్‌లో విధిగా పొందుపరచాలని >>2

500 రోజుల్లో మళ్లీ మేమే

కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు

ఇది ప్రజాపాలన కాదు.. పర్సంటేజీల పాలన
మహిళలకు రూ.1.50 లక్షలు ఎప్పుడిస్తారు?
భవిష్యత్తు 'ఫ్యూచర్ సిటీ' వరంగల్లు: కెటిఆర్



ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో,నవంబరు 22, ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రభుత్వ పనులకు బిల్లులు చెల్లించాలంటే బీస్ పర్సంటేజ్ కమీషన్లు అడుగుతున్నారంటూ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. 20 శాతం కమీషన్ అడుగుతున్నారనే ఆరోపణలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సొంత పార్టీ నాయకులే ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని కేడీసీ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన జనచైతన్య సభలో ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.
భవిష్యత్తు అవకాశాలకు అసలైన చిరునామా వరంగల్ నగరమేనని, హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయడం కాదని, వరంగల్‌ను ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, మరో 500 రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2028లో కేసీఆర్ మళ్లీముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని అన్నారు. ప్రజాపాలన పేరుతో పర్సంటేజీల పాలన సాగుతోందని, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన జనచైతన్య సభలో ఆయన ప్రసంగించారు.
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సభా వేదికపై తెరపై ప్రదర్శిస్తూ కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రూ.4 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి ్రతోపాటు తులం బంగారం వంటి హామీలను ఏమి చేశారని ప్రశ్నించారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడం దేవుడెరుగు.. కనీసం 1.67 కోట్ల మంది మహిళలకు ఐదేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున ఎప్పుడు ఇస్తారని సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీశారు. మహిళలను లక్షాధికారులను చేసి చూపిస్తే తాను రాజకీయాల నుంచి >>2

పలు రాష్ట్రాల్లో రక్తం చిందిన రోడ్లు

5 వేర్వేరు ఘటనల్లో 25 మంది దుర్మరణం, పలువురికి గాయాలు



నీటి వాటాలు నేడు తేలేనా?

కొత్త పథకాలతో సవాళ్లు విసురుతున్న ఎపి
అధికార, విపక్షాల వాదోపవాదాలు
సంక్షోభం నేపథ్యంలో నేడు కెఆర్ఎంబి భేటీ

హైదరాబాద్, నవంబరు22,ప్రభాతవార్త: ఓవైపు ఎల్‌నినో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అధికార పార్టీ ప్రతిపక్షపార్టీల రాజకీయ పోరాటం తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులపై ఒత్తిడిపెంచి అనిశ్చితికి గురి చేస్తోంది. ప్రాణహిత చేవెళ్ళ తుమ్మిడిహట్టి ఎత్తిపోతల పథకం సిఇ పాలమూరు రంగారెడ్డి సిఇ సెలవుల్లో వెళ్ళారు. ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి సాధ్యమైనంత ఎక్కువ నీటిని తరలించేందుకు అమరజీవి జలధార వంటి కొత్త పథకాలతో సవాళ్ళు విసురుతంటే తెలంగాణ ఇంజనీర్లు తాఖీదులు అందుకొని సమాధానం చెప్పుకోలేని స్థాయిలో దోషిలుగా నిలుచున్నారు.నీటిపారుదలశాఖ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో కనబరుస్తున్న ఉదాసీనత, కీలక సర్కిల్ సిఇలు సెలవు పెట్టి సాగు నీటికి తాగునీటికి ప్రమాదం పొంచిఉన్న కరవు వేళలో >>2

హైదరాబాద్‌లో 'ఉగ్ర' బెదరింపులు!

లష్కరే తోయిబా పేరుతో ఫేక్ మెయిల్
పోలీసులు హై అలర్ట్



హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త: హైదరాబాద్‌లో దాడులకు పాల్పడుతామంటూ ఉగ్రవాదుల పేరుతో వచ్చిన ఈమెయిల్స్ కలకలం రేపుతున్నాయి. లష్కరే తోయిబా టెర్రరిస్ట్ లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా నగరంలో దాడులు చేస్తామని బెయిల్‌లో పేర్కొన్నారు. 26/11 ఉగ్రదాడి తరహాలో దాడి జరుగుతుందని మెయిల్లో పేర్కొన్నారు.కాచిగూడ రైల్వే స్టేషన్ లక్ష్యంగా దాడులు చేస్తామని.. హోటల్ టూరిస్ట్ ప్లాజా వద్ద బాంబు పేలుస్తామంటూ హెచ్చరించారు.
జమ్మూ కశ్మీర్‌లో >>2



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

పోలీసు బ్యాండ్లకు మళ్లీ పూర్వ వైభవం..

8

బ్రాస్, పైప్ బ్యాండ్ల బలోపేతానికి డిజిపి సివి ఆనంద్ నిర్ణయం

26న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

హైదరాబాద్,నవంబరు 22,ప్రభాతవార్త: దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రమాదంలో పడుతున్నాయని భిన్నభావాలను దేశ ద్రోహంగా చూడటం తగదని ప్రజాస్వామిక ఆలోచనలు అనేక రూపాల్లో స్వేచ్ఛగా సమాజంలోకి పోవాలనే సంకల్పంతో బిఆర్ అంబెదర్కర్ రూపొందించిన రాజ్యాంగ పరిరక్షణ పేరుతో ఈ నెల 26న అంబేద్కర్ విగ్రహం నుంచి నెహ్రూ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం గాంధీ భవన్‌లో పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో >>2

రూ.819.61 కోట్ల ప్రజాధనం దారి మళ్లింపు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 55 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు
బంధువుల పేర్లపై భూములు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులపైనా ఆరా



మింగిన ధాన్యం కక్కించాల్సిందే..

మిల్లర్లపై ఇడి పంజా

యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త: రైతుల చెమట చుక్కలతో పండిన ధాన్యం.. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ప్రజాధనం.. కొందరు మిల్లర్ల అక్రమాలకు బలైందన్న ఆరోపణలు ఇప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని పక్కనపెట్టి, ధాన్యాన్ని దారి మళ్లించిన వ్యవహారంలో ఇక లెక్కలు చెప్పడం కాదు.. ఆస్తులు బయటపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు నోటీసులు, హెచ్చరికలు, బకాయిల వసూళ్లకే పరిమితమైన చర్యలు ఇప్పుడు ఆస్తుల వేట వరకు చేరినట్లు తెలుస్తోంది. ఏకంగా రూ.819.61 కోట్ల విలువైన ధాన్యం దారి మళ్లినట్లు అంచనాలు వెలుగులోకి రావడం, ఉమ్మడి నల్గొండజిల్లాలో 55 రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదవడం సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు కదలికలు మొదలైనట్లు వస్తున్న సమాచారంతో మిల్లర్లలో గుబులు మొదలైంది. మిల్లుల్లోని >>2



గాంధీనగర్‌లోని 'దండి కుటీర్' వద్ద ఆదివారం నిర్వహించిన 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్'లో పాల్గొన్న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి

'ఉగ్ర' బెదరింపులు

>> లష్కరే తయిబా టాప్ కమాండర్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హత్యకు ప్రతీకారంగా దాడులు చేస్తామని బెదిరించారు.అయితే, లష్కరే తోయిబా పేరుతో వచ్చింది ఫేక్ మెయిల్‌గా పోలీసులు తేల్చారు. శనివారం రాత్రి 9:03 నిమిషాలకు హైదరాబాద్ సీపీ, స్పెషల్ బ్రాంచ్‌ను ఉద్దేశిస్తూ ఓ మెయిల్ వచ్చింది. దీంతో వెంటనే స్పెషల్ బ్రాంచ్ అప్రమత్తమైంది.హోటళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో భద్రత పెంచాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, వదిలివెళ్లిన వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అన్ని భద్రతా విభాగాలతో సమన్వయం చేసుకోవాలని పోలీసులకు ఆదేశాలు వచ్చాయి. అప్పటికప్పుడు అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో రాత్రంతా సోదాలు కొనసాగాయి. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

కోటి ఓట్లు.. 90 సీట్లు

>> అనేక మంది పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులను బలవంతంగా, అక్రమ కేసుల ద్వారా కేసీఆర్ బీఆర్ఎస్ కండువాలు కప్పారు, తెలంగాణలో కాంగ్రెస్ లేదు, మళ్లీ పెరగనివ్వకుండా అడ్డుకుంటానని కేసీఆర్ విర్రవీగాడు,నేను పీసీసీ అధ్యక్షుడిగా డిజిటల్ మెంబర్‌షిప్ చేపట్టి 90 రోజుల్లో 48 లక్షల మెంబర్‌షిప్ చేయించాం,దేశంలోనే అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయించాం, ఆత్మవిశ్వాసాన్ని కేసీఆర్ దెబ్బతీసినప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలు విజయమో, వీర మరణమో అన్నట్లుగా సభ్యత్వం చేయించారు,అత్యధిక సభ్యత్వం చేయించిన ప్రతి ఒక్కరినీ రాహుల్ గాంధీని కలిపించి అభినందింపజేశాం' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో 92,35,833 ఓట్లు తెచ్చుకుని 64 సీట్లు గెలుచుకుంది, ఒక సీటు సీపీఐ గెలిచింది, 90 లక్షల ఓట్లు రావడం వెనుక కార్యకర్తల కృషి ఎంతో ఉంది, పార్టీ కోసం పనిచేసిన అనేక మందికి టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నాం, అనేక మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకుల ఇళ్లకు పార్టీ బీ ఫామ్ పంపించాం' అని చెప్పారు. 'తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి పదవి చాలా గౌరవమైంది, అనేక మంది హేమాహేమీలు ఈ పదవిలో పనిచేశారు అని చెప్పారు. బీజేపీ 240 సీట్లు దాటే ప్రసక్తే లేదని గతంలో నేను ఒక ఇంటర్వ్యూలో తేల్చి చెప్పాను, అదే జరిగింది, బీజేపీకి 25 సీట్లు తగ్గి, కాంగ్రెస్‌కు 25 సీట్లు పెరిగి ఉంటే ఇప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది అని చెప్పారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలి.అధికారంలోకి వచ్చేందుకు కావాల్సిన వ్యూహం మేం రూపొందిస్తున్నాం, రాజకీయాల్లో బ్యాలెన్స్ షీట్ ఐదేళ్లకు ఒకసారి వస్తుంది, ఎవరి శ్రమ ఎంత ఉందో ఎన్నికల సమయంలో కొలుస్తాం, కష్టపడిన వాళ్లను గుర్తిస్తాం' అని చెప్పారు. బీసీలకు మాత్రం లెక్క లేదు,95 ఏళ్ల తర్వాత తెలంగాణలో కులగణన చేసి చూపించాం, అన్ని చట్టాలు, న్యాయస్థానాల ముందు నిలబడేలా కులగణన చేశాం,కులగణనలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలబడింది, తెలంగాణను చూసి కులగణన చేయాలని కేంద్రానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే లేఖ రాశారని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల కోసం మొదటిసారి తెలంగాణ చట్టం చేసింది.. దేశంలో మొదటి ప్రభుత్వం మనదేనన్నారు.ఎన్టీఆర్ తరం, వైఎస్సార్ తరం, కేసీఆర్ తరం, నాలుగు దశాబ్దాల్లో అమలు చేసిన అన్ని పథకాలను కొనసాగిస్తూనే మరికొన్ని చేస్తున్నాం అని చెప్పారు.గతమే కానీ భవిష్యత్తు లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది, తప్పుడు ప్రచారాన్నే నమ్ముకుని అధికారంలోకి వస్తామని అనుకుంటోందన్నారు. 'కోటి కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా అమలు చేస్తున్నాం, 52 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం, 3.42 కోట్ల మందికి ఆరు కిలోల సన్న బియ్యం ఇస్తున్నాం, బీఆర్ఎస్ నాయకులు కూడా మనం ఇచ్చిన సన్నబియ్యం తింటున్నారు, బీఆర్ఎస్ నాయకుల ఆడవడుచులు మనం ఇచ్చే ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు.బీఆర్ఎస్ నాయకుల ఇళ్లలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో వెలుగులు వస్తున్నాయి, బీఆర్ఎస్ వాళ్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం,పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్నాం, ఇస్తున్న పథకాలను ప్రజలకు పార్టీ శ్రేణులు గుర్తు చేయాలి' అని చెప్పారు.'మహిళా సంఘాలకు 75 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేశాం.. రెండు వేల కోట్ల రూపాయలను వడ్డీ కింద ప్రభుత్వం చెల్లించింది,అచ్చంపేట దగ్గరలో సేవాలాల్ మందిరాన్ని నిర్మించబోతున్నాం, జ్యోతిబా ఫూలే దంపతులు, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశాం, పండుగ సాయన్న విగ్రహాన్ని పెట్టుకోబోతున్నాం,బలహీన వర్గాల నుంచి వచ్చి స్ఫూర్తిని ఇచ్చిన మహనీయుల విగ్రహాలు పెట్టాలని ఏనాడు కేసీఆర్ అనుకోలేదు' అని చెప్పారు.'కాళేశ్వరంలో చేసిన పాపాలు కడుక్కోవడానికి సచివాలయానికి కేసీఆర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టారు' అని పేర్కొన్నారు. 'నేను కార్యకర్తల నాయకుడిని.. వాళ్ల ఆలోచన నాకు తెలుసు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని మాత్రమే కార్యకర్తలు కోరుకుంటారు, పదవులు కాదు' అని చెప్పారు.

26న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

>> ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ఉద్యమం చేస్తున్నారని కొనియాడారు. ఓటుహక్కుకు ప్రజలను దూరం చేసే కుట్రలతో సాగిన సర్ పై తెలంగాణలోనూ పలు కార్యక్రమాలు చేపట్టామనీ ఇలా ప్రజాస్వామ్యం పరిక్షణకు ఓట్ల పరిరక్షణకు పూనుకొంటూ అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలను కోరారు.సర్‌కు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భారీ ర్యాలీలు నిర్వహించామనీ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ర్యాలీకి తెలంగాణ నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చారనీ మహేష్‌కుమార్ చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు వచ్చే అవకాశం సి ఎం నిత్యం అప్రమత్తం చేశారని స్పోత్కర్షలు చెప్పుకొన్నారు. ఎల్‌నినో అంశంపై కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేదనీ కేంద్ర విధానాల వల్ల తెలంగాణకు ఎక్కువ నష్టం జరుగుతోందనీ ఆవేదన చెందారు.
ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందనీ పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలనీ కోరారు. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ, ప్రభుత్వ సమన్వయ బాధ్యతలను అదిష్టానం సందీప్ కుమార్ అప్పగించిదనీ ఆ దిశలో తెలంగాణలో పనిచేయాలనీ మహేష్‌కుమార్ ఉద్బోదించారు.

నితిన్ నబీన్ నేడు రాక

>> వద్ద హెలిప్యాడ్ దిగిన వెంటనే నేరుగా గాంధీ బొమ్మ వద్ద నుండి ప్రారంభమయ్యే మహా పాదయాత్రకు చేరుకోనున్నారు. వైశ్యా భవన్ వద్ద ప్రజా హారును ఉద్దేశించి నితిన్ నబిన్ ప్రసంగించనున్నారు. ప్రసంగం ముగిసిన వెంటనే వైశ్యాభవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గడియారం సెంటర్, శాస్త్రి రోడ్, భారత్ టాకీస్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు ప్రజలతో కలిసి నితిన్ నబిన్ మహా పాదయాత్ర చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హైదరాబాద్ చేరుకుని, అక్కడి నుండి విమానంలో ఢిల్లీకి చేరుకుంటారు. నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ రానున్న నేపథ్యంలో దాదాపు లక్ష మందితో మహా పాదయాత్ర నిర్వహించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్ని ఏర్పాట్లు చేశారు. గత రెండు రోజుల నుండి పార్టీ నేతలతో వరుస మీటింగ్ లు పెడుతూ జన సమీకరణ, పాదయాత్ర ఏర్పాట్లు, నగర అలకరణ, ప్లెక్సీల ఏర్పాటు వంటి అంశాల పై దిశా నిర్దేశం చేశారు. పాదయాత్ర స్థలికి వెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షించడంతోపాటు లక్ష కు మించి జనం హాజరయ్యేలా బండి సంజయ్ కుమార్ కసరత్తు పూర్తి చేశారు. కరీంనగర్‌ను తోరణాలు, జెండాలతో అందంగా అలంకరించారు. మరోవైపు నితిన్ నబిన్‌కు వినూత్న రీతిలో స్వాగతం పలికేందుకు బండి సంజయ్ కుమార్ ఏర్పాట్లు చేశారు. తెలంగాణ కళాకారుల ఆట పాటలు, డప్పు నృత్యాలతో నితిన్ నబిన్ కు ఘన స్వాగతం పలుకుతారు.మహా పాదయాత్రకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు యాత్ర పొడువునా రవాణా, మంచినీటి వసతి సౌకర్యాలను కల్పించారు. దాదాపు లక్షకు పైగా మజ్జిగ ప్యాకెట్లను అందు బాటులో ఉంచారు. మొత్తంగా సోమవారం కరీంనగర్‌లో జరగబోయే నితిన్ నబిన్ మహా పాదయాత్ర చరిత్ర సృష్టించడం ఖాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. 'సర్' పేరుతో రాజ్యాంగ సంస్థలపై దాడులు చేస్తూ దేశ ప్రతిష్టకు కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు భంగం కలిగిస్తున్న నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అరాచకాన్ని అంతం చేద్దాం పేరిట దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో బీజేపీ జాతీయ నాయకత్వం ఈ మహా పాదయాత్ర ర్యాలీలు నిర్వహిస్తోందన్నారు. వీటిలో కరీంనగర్ మహా పాదయాత్ర హైలైట్ గా నిలవనుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండె ల్లో వణుకు పుట్టేలా మహా పాదయాత్రను విజయవంతం కాబోతుందని చెప్పారు.

వారం - వర్జ్యం

23-11-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, అనురాధ కార్తె,
తి.చతుర్దశి రా.11.39, న.భరణి రా.1.59
వ.మ.12.56 - మ.2.23
దు.మ.12.15 - మ.1.00,
2.మ.2.31- మ.3.16
రాహు ఉ.7.30-ఉ.9.00,
శుభ స. లేదు

వార్తాఫలం

మేషం: పదే పదే మీ సహాయాన్ని అర్థించే కొందరిని మీరు దురంగా ఉంచుతారు. నేర్పుతో ముందుకు సాగుతారు.

వృషభం: దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత కలవరపాటును కలిగిస్తుంది. వాహనాల విషయంలో నిర్లక్ష్యం వద్దు.

మిథునం: వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటాబయటా కొంతవరకు అనుకూలంగాఉంటుంది.వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

కర్కాటకం: ఖర్చులు అదుపు చేసుకోవడానికి ఏంతగానో కృషి చేస్తారు. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు.

సింహం: ఆస్తి వివాదాలు చికాకులు పెడతాయి. వృత్తిలో ఆటంకాలు ఎదురౌతాయి. కాంట్రాక్టులు దక్కటం కష్టమే.

కన్య : రాజకీయ రంగాల వారికి అనుకూలంగా ఉంటుంది. కార్యక్రమాలు చేపట్టినా సంతృప్తి కరంగా సాగవు.

తుల: మిత్రులతో వివాదాలు ఏర్పడతాయి. భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు కష్టమే. ఉద్యోగులకు బదిలీలు.

వృశ్చికం: కార్యక్రమాలు చేపట్టినా ముందుకు సాగవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. వృత్తిలో ఆటంకాలు తప్పవు.

ధనుస్సు: పోటీ పరీక్షలలో పాల్గొంటారు. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు. అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

మకరం: హోదాలు, ఉన్నత పదవులలో ఉన్న వారితో పరిచయాలు ఏర్పడతాయి. అవి మీకు భవిష్యత్తుకు ఉపకరిస్తాయి.

కుంభం: కుటుంబ సభ్యులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. ముఖ్యమైన పనులు నిదానంగా సాగుతాయి. ప్రయాణాలు

మీనం: మొండి బాకీలు వసూలవుతాయి. ఉద్యోగంలో చిక్కులు ఎదురవుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

మింగిన ధాన్యం కక్కించాల్సిందే..

>> నిల్వల లెక్కలతోపాటు మిల్లర్ల స్థిర, చరాస్తులు, కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై ఉన్న భూములు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులపైనా దర్యాప్తు బృందాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ధాన్యం దారి మళ్లించి సంపాదించిన సొమ్మును ఎక్కడెక్కడ పెట్టుబడులుగా మార్చారన్న కోణంలోనూ పరిశీలన సాగుతున్నట్లు తెలుస్తోంది.
ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రభుత్వ ధాన్యం దారి మళ్లింపు వ్యవహారం తీవ్రతను జిల్లాలవారీగా నమోదైన కేసులు స్పష్టం చేస్తున్నాయి. నల్గొండ జిల్లాలో 16 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదుకాగా, సుమారు రూ.230.61 కోట్ల విలువైన ధాన్యం దారి మళ్లినట్లు అంచనా. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 35 మిల్లులపై కేసులు నమోదయ్యాయి. ఇక్కడ దారి మళ్లిన ధాన్యం విలువ సుమారు రూ.500 కోట్లుగా చెబుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నాలుగు రైస్ మిల్లులపై కేసులు నమోదుకాగా, దాదాపు రూ.89 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 55 మిల్లులు.. రూ.819.61 కోట్ల విలువైన ధాన్యం.. ఈ గణాంకాలు ప్రభుత్వ ధాన్యం నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాల తీవ్రతను బయటపెడుతున్నాయి. ఇంత భారీ మొత్తంలో ధాన్యం దారి మళ్లినప్పుడు పర్యవేక్షణ వ్యవస్థలు ఏం చేశాయి? ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి పూర్తిస్థాయిలో వసూలు చేస్తారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
దర్యాప్తు ఇప్పుడు మిల్లుల గోడలు దాటి మిల్లర్ల వ్యక్తిగత ఆస్తుల వరకు చేరినట్లు సమాచారం. ఇప్పటివరకు ధాన్యం నిల్వలు, కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సీఎంఆర్) బకాయిల చుట్టూ తిరిగిన విచారణ.. ఇప్పుడు ఆర్థిక లావాదేవీల మూలాలను వెలికితీసే దిశగా సాగుతున్నట్లు తెలుస్తోంది. మిల్లర్ల పేర్లపై ఉన్న భూములు, భవనాలు, ఇతర స్థిరాస్తులు, వాహనాలు, వ్యాపార పెట్టుబడులు, రియల్ ఎస్టేట్ లావాదేవీల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై కొనుగోలు చేసిన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఎన్ని ఎకరాలు కొనుగోలు చేశారు? ఎప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగాయి? ప్లాట్లు, ఇతర ఆస్తుల కొనుగోళ్లకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? అన్న కోణాల్లో పరిశీలన సాగుతున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖ ద్వారా భూముల వివరాలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రిజిస్ట్రేషన్ రికార్డులు, సంబంధిత శాఖల నుంచి ఆస్తుల వివరాలను సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత మూడు రోజులుగా వివిధ బృందాలు ఈ వివరాల సేకరణలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. అయితే ఈడీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.
యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ ధాన్యం బకాయిల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. 202223 రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం వేలం వేసిన ధాన్యానికి రావాల్సిన సొమ్ములో ఇప్పటివరకు రూ.51,74,47, 533లు రికవరీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ మరో రూ.13,72, 85,019 ప్రభుత్వ ఖజానాకు చేరాల్సి ఉంది. అంటే రూ.51.74 కోట్ల మేర వసూలు చేసినా ఇంకా రూ.13.72 కోట్ల బకాయిలు మిగిలే ఉన్నాయి. ఈ మొత్తాన్ని ఎప్పటిలోగా రాబడతారు? చెల్లింపుల్లో జాప్యం చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కోట్ల రూపాయల ప్రజాధనం బకాయిల రూపంలో నిలిచిపోతున్నా వసూళ్లు ఎందుకు పూర్తికావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. నిర్ణీత గడువులోగా ధాన్యాన్ని మరపట్టి నిబంధనల ప్రకారం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే కొన్ని మిల్లుల్లో ధాన్యం నిల్వలకు, అప్పగించాల్సిన బియ్యానికి మధ్య భారీ వ్యత్యాసాలు బయటపడటంతో సీఎంఆర్ బకాయిల సమస్య తీవ్రమైంది. ధాన్యం నిల్వలు గల్లంతైనట్లు గుర్తించిన చోట ప్రభుత్వం వేలం ప్రక్రియ చేపట్టింది. అయినప్పటికీ వేలంద్వారా విక్రయించిన ధాన్యానికి రావాల్సిన సొమ్ము కూడా పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడం పరిస్థితిని మరింత జటిలం చేసింది. ఒకవైపు సీఎంఆర్ బకాయిలు.. మరోవైపు వేలం ధాన్యం బకాయిలు.. ఇంకోవైపు క్రిమినల్ కేసులు.. ఇలా ప్రభుత్వ ధాన్యం వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది.
ఇంత భారీ స్థాయిలో ధాన్యం దారి మళ్లినట్లు ఆరోపణలు వస్తున్నా సంబంధిత అధికారులు ముందుగానే ఎందుకు గుర్తించలేకపోయారన్న ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. మిల్లుల్లో నిల్వల తనిఖీలు సక్రమంగా జరిగాయా? కేటాయించిన ధాన్యం, రవాణా, నిల్వలు, మిల్లింగ్ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించారా? బకాయిలు పేరుకుపోతున్న సమయంలో బాధ్యులపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదు? పర్యవేక్షణలో నిరక్ష్యం ఎక్కడ జరిగిందా? ఎక్కడైనా అధికారుల సహకారం ఉందా? అన్న కోణాల్లోనూ సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. మిల్లర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవడంతోపాటు, అధికారుల పాత్రపై కూడా నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపైచర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. రూ.819.61 కోట్ల విలువైన ధాన్యం దారి మళ్లింపు వ్యవహారం కేవలం బకాయిల వసూళ్ల సమస్య కాదు. ఇది రైతుల శ్రమకు, ప్రభుత్వ ఖజానాకు సంబంధించిన తీవ్రమైన ప్రజాధన దోపిడీ ఆరోపణల వ్యవహారం. కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. దారి మళ్లిన ధాన్యం ఎక్కడికి చేరింది? దాని ద్వారా వచ్చిన సొమ్ము ఎవరెవరి చేతుల్లోకి వెళ్లింది? ఎంత మొత్తం రికవరీ అయింది? ఇంకా ఎంత వసూలు కావాలి? అక్రమ సొమ్ముతో కొనుగోలు చేసినట్లు అనుమానిస్తున్న ఆస్తులెన్ని? అన్న ప్రతి ప్రశ్నకు దర్యాప్తు సంస్థలు సమాధానం చెప్పాల్సి ఉంది. నిందితులుగా తేలిన వారి ఆస్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని పూర్తిగా రాబట్టినప్పుడే ఈ దర్యాప్తుకు సార్థకత చేకూరుతుంది. లేదంటే వందల కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం దారి మళ్లింపు మరోసారి కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల చూపంతా దర్యాప్తు సంస్థల తదుపరి చర్యలపైనే.

డేటా సెంటర్ల హబ్‌గా తెలంగాణ

>> ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంస్థకు చెందిన తయారీ, పరిశోధన అభివృద్ధి, విక్రయాలు తదితర విభాగాల్లో ఇప్పటికే 5 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. సంస్థకు చెందిన తెలంగాణ యూనిట్ ప్రపంచవ్యాప్తంగా ఆదర్శవంతమైన యూనిట్‌గా (లైట్‌హౌస్) గుర్తింపు పొందడం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి గర్వకారణమని అన్నారు. తెలంగాణతో సంస్థ సంబంధాలను బలోపేతం చేసినట్లు పేర్కొన్నారు. సంస్థ అంతర్జాతీయ స్థాయి సామర్థ్యాలు, భారత్‌లో విస్తరించిన కార్యకలాపాలు, తెలంగాణతో పెరుగుతున్న భాగస్వామ్యంపై చర్చించినట్లు తెలిపారు. అత్యాధునిక ఎనర్జీ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆటోమేషన్ పరిష్కారాల వినియోగంపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నట్లు వెల్లడించారు.
విద్యుదీకరణ, ఆటోమేషన్, డిజిటల్ సాంకేతికతల సమన్వయంతో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలను మరింత సమర్థవంతంగా, పటిష్టంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక రంగం, డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ష్నైడర్ ఎలక్ట్రిక్ సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందన్నారు.



గురునానక్ 557వ జయంతి వేడుకల నేపథ్యంలో అట్టారీ వాఘా సరిహద్దు గుండా పాకిస్థాన్‌కు వెళ్లేందుకు ఆదివారం క్యూలో వేచి ఉన్న సిక్కు యాత్రికులు

నీటి వాటాలు నేడు తేలేనా?

>> రైతులను ప్రజలను మరింత అనిశ్చితికి గురిచేస్తున్నారు. కృష్ణా,గోదావరి బెసిన్‌లో నీటిపారుదల ఉద్యోగులపై ప్రభుత్వం పూర్తిగా నియంత్రణ కోల్పోతుండటంతో క్షేత్రస్థాయి వాస్తవిక పరిస్థితులు ఎవరో చెబితే కానీ తెలుసుకోని పరిస్థితి నెలకొనడం విషాదకరం. దీనికితోడు నీటిపారుదల శాఖకు చెందిన కీలక సర్కిళ్ల సిఇ ఇద్దరు సెలవు పెట్టడం తీవ్ర పని ఒత్తిడితోపాటు పలు కారణాలతో వారు సెలవుపై వెళ్లినట్లు నీటిపారుదల ఉద్యోగులు అసంతృప్తిని వ్యక్తం చేస్తూ చర్చించుకొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఉమ్మడి నిపుణులతో ప్రాణహితచేవెళ్ల ఎత్తిపోతల్లోని తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు కీలక దశలో ఉన్న తరుణంలో మంచిర్యాల సిఇగా ఉన్న నరసింహమూర్తి సెలవుపై వెళ్లారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోకి వచ్చే నాగర్ కర్నూల్ చీఫ్ ఇంజనీర్ విజయ భాస్కర్ రెడ్డి కూడా అంతకు ముందే సెలవు పెట్టారు. కృష్ణా నదిపై ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణకు నీటిపై ఒడవనిపంచాయతీ నెలకొంది. ప్రస్తుతం కుడికాలువకు ఎనిమిది టిఎంసిలు ఎడమకాలువ చివరికి ఒక టిఎంసి నీటిని విడుదలచేయాలని కెఆర్‌ఎంబిని ఆంధ్రప్రశ్ ఆశయించడంతో సోమవారర కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటి కాబోతున్నది బోర్డు కార్యదర్శి, రెండు తెలుగు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్లు ఇందులో సభ్యులు. రెండు రాష్ట్రాల నీటి అవసరాలపై చర్చించేందుకు ఈ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్ నుంచి పల్నాడు అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు వ్యవహారం కూడా తెలంగాణను రగిలిస్తోంది. ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ చేతకాని తనం వల్ల జలదోపడి జరుగుతోందని తీవ్రదాడి మొదలు పెట్టింది. దీనికి ప్రతిగా బిఆర్ఎస్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 4464టిఎంసిలు వాడుకొంటే తెలంగాణ 1993 టిఎంసిలు మాత్రమే వాడుకొందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నుంచి మొదలుకొని టిపిసిసి చీఫ్ వరకు ఎదురుదాడికి దిగారు. కృష్ణాజ లాలలో 811 టిఎంసిల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు ఇచ్చి 299టిఎంసిలకు మాత్రమే తెలంగాణ ఒప్పించం చేసుకొని గత పాలకులు అన్యాయం చేశారని ప్రజల ముందు ప్రభుత్వం వాదిస్తోంది. అధికార పార్టీ ప్రతిపక్షపార్టీల రాజకీయ పోరాటంతో నల్గొండ సర్కిల్ ఇంజినీ ర్లపై ప్రభుత్వం చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే సర్కిల్ ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పనిచేసే ఇఇ, డిఇ, ఎఇలకు ఈ నిరక్ష్యంలో భాగస్వామ్యం లేదా.. వారిపైనా ఎందుకు చర్యలు తీసుకోరాదంటూ నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ఇంజినీర్లను ప్రశ్నించినట్లు తెలిసింది. సాగర్ నుంచి 1.86 టిఎంసి ల తాగు నీటిని ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు ప్రాంతంలోని 633 గ్రామాలకు ఇచ్చేందుకు మూడు ఇన్టేక్వెల్ లతోపాటు ఇతర నిర్మాణాలను చంద్రబాబు ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణకు చెందిన నాగార్జునసాగర్ సర్కిల్ ఇంజినీర్లు నీటిపారుదల శాఖకు, ప్రభుత్వానికి తెలియజేయడంలో విఫలం కావడంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. మరోవైపు ఈ అంశంపై నల్గొండ కలెక్టర్ కూడా ప్రభుత్వం వివరణ కోరినట్లు తెలిసింది. దీంతో క్షేత్రస్థాయి పరిణామాలను కలెక్టర్ నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపించారు. నీటిపారుదల సిఇ కూడా ఒక నివేదిక అందజేశారు.అనుమతుల్లేని ప్రాజెక్టులకు చట్టబద్ధత ఉండదని

శంషాబాద్ విమానాశ్రయంలో
రూ.1.37కోట్ల బంగారం పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం

శంషాబాద్ నవంబరు22,ప్రభాతవార్త: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా విదేశీ బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి మస్కట్ మీదుగా నవంబర్ 20న హైదరాబాద్‌కు చేరుకున్న ప్రయాణికుడిపై వచ్చిన సమాచారం తో అధికారులు తనిఖీలుచేపట్టారు. ఈ సందర్భంగా అతడి ట్రాలీబ్యాగులోని వాలెట్‌లో దాచిన 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 1,049.76గ్రాముల బంగారు బిస్కెట్లను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.1.37కోట్లు ఉంటుందని అంచనా వేశారు. విచారణలో విమానాశ్రయం వెలుపల వేచి ఉన్న మరో వ్యక్తికి బంగారం అప్పగించాల్సి ఉన్నట్లు వెల్లడైంది.దీంతో డీఆర్ఐ అధికారులు అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు.అక్రమంగా బంగారం తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరినీ కస్టమ్స్ చట్టం1962కింద అరెస్టుచేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

సిఎం రేవంత్‌రెడ్డికి కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం
చాదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద అడ్డుపడ్డ ఎద్దు

హైదరాబాద్,నవంబరు 22, ప్రభాతవార్త: హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కు పెను ప్రమాదం తప్పింది. ఆదివారం గాంధీ భవన్ నుంచి హైదరాబాద్ రేస్ కోర్స్‌లో జరిగే చీఫ్ మినిస్టర్ ట్రోఫీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం బయలు దేరారు. మార్గ మధ్యంలో కాన్వాయ్ చాదర్‌ఘాట్ చిన్న బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా ఓ ఎద్దు ఎదురుగా అడ్డుపడింది. ఎదురుగా ఎద్దు రావడంతో గమనించిన సిఎం కాన్వాయ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. క్షణాల్లో బ్రేకులు వేసి వాహనాలను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ తర్వాత పరిస్థితిని అదుపులోకి తీసుకుని కాన్వాయ్ నెమ్మదిగా ముందుకు సాగింది. ఈ ఘటనతో అక్కడున్న మలక్‌పేట ట్రాఫిక్ కానిస్టేబుళ్లు వెంటనే స్పందించారు. కాన్వాయ్‌కు ఎదురుగా వెళ్లిన ఎద్దును అప్రమత్తంగా పక్కకు తప్పించారు. ట్రాఫిక్ పోలీసుల సమయ స్ఫూర్తితో ఎలాంటి ఇబ్బంది లేకుండా సీఎం కాన్వాయ్ ముందుకు కదిలింది.

కూతుళ్లు వద్దంటూ భార్యకు ట్రిపుల్ తలాక్!
ఫోన్ సందేశం ద్వారా విడాకులు.. సైదాబాద్ పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

హైదరాబాద్ (సైదాబాద్) నవంబరు 22 ప్రభాత వార్త: తనకు కొడుకు కావాలని, కూతుళ్లు వద్దంటూ ఓ వ్యక్తి భార్యకు ఫోన్ సందేశం ద్వారా ట్రిపుల్ తలాక్ చెప్పిన ఘటన సైదాబాద్‌లో వెలుగుచూసింది. తనకు భార్య నచ్చలేదని, తన తల్లి, సోదరికి కూడా ఆమె, కూతుళ్లు ఇష్టం లేదంటూ తలాక్ సందేశం పంపినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైదాబాద్ లోకాయుక్త కాలనీకి చెందిన నిషాంత్ ఆఫ్రీన్ (37)కు మలక్‌పేట ప్రాంతానికి చెందిన మహ్మద్ అతి అర్ఫాద్ (40)తో 2015 ఆగస్టులో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో కొంత కాలంగా విడాదాలకు సంబంధించి కేసులు నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో గత నెల 24న రాత్రి ఆఫ్రీన్‌కు అర్ఫాద్ ఫోన్ చేసి డిసెంబర్‌లోగా కేసులు ఉపసంహరించుకోవాలని, లేకపోతే తనను వదిలేస్తానని హెచ్చరించాడు. మరుసటిరోజే ఫోన్ సందేశం ద్వారా ట్రిపుల్ తలాక్ చెప్పాడు. దీంతో బాధితురాలు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అత్త, ఆడపడుచు తనపై కక్షతో భర్తను ప్రేరేపించి విడాకులు ఇప్పించారని ఫిర్యాదులో పేర్కొంది.

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి
రూ.30 లక్షల విలువైన సరకు పట్టివేత.. ముగ్గురు అరెస్టు
కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం మరో ఇద్దరి కోసం గాలింపు

మల్కాజిగిరి, నవంబరు 22: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఎస్ ఓటీ ఉప్పల్ విభాగం, నాచారం పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో చేపట్టిన తనిఖీల్లో రూ.30 లక్షల విలువైన 60.380 కిలోల ఎండిన గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన కారుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 20న నాచారం-చిలుకానగర్ రహదారిలోని ఐడీఏ నాచారం, రోడ్ నంబర్ 5లో స్టెర్లింగ్ షూస్ కంపెనీ సమీపంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. సాయంత్రం 6.23 గంటలకు అనుమానాస్పదంగా వచ్చిన నీలిరంగు ఫియట్ లీనియా కారును అడ్డుకుని తనిఖీ చేయగా నాలుగు గోనె సంచుల్లో 60ప్యాకెట్లుగా ఉన్న 60.380 కిలోల గంజాయి బయటపడింది. విచారణలో ఒడిశాలోని బెర్హంపూర్‌కు చెందిన రాహుల్ అలియాస్ కృష్ణ అలియాస్ ఖిలో ప్రధాన సరఫరాదారుగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒడిశాలో కిలో గంజాయిని రూ.2 వేల చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్, ముంబయి నగరాల్లో అధిక ధరకు విక్రయించేలా పథకం రూపొందించినట్లు వెల్లడైంది. ఒక్కో రవాణాకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు చెల్లిస్తామని ఆశ చూపి నిందితులను నియమించుకున్నట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో ముంబయికి చెందిన సమీర్ హసన్ అలీ షేక్ (42), హైదరాబాద్ కింగ్‌కోఠికి చెందిన మహమ్మద్ ఖాన్ (52), కూకట్‌పల్లిలో నివసించే ఒడిశా వాసి చందన్‌కుమార్ జెనా (31) ఉన్నారు. ప్రధాన సరఫరాదారు రాహుల్, గంజాయి కొనుగోలు, లోడింగ్‌లో సహకరించిన అజయ్ సాగర్ పరారీలో ఉండటంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయి సరఫరా నెట్‌వర్క్, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది. పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో ఉప్పల్ జోన్ డీసీపీ కె.సురేష్ కుమార్, ఎస్ఓటీ డీసీపీ కె.మనోహర్ మార్గదర్శకత్వంలో ఉప్పల్ ఏసీపీ వై. వెంకట్‌రెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్, ఎస్ఓటీ ఉప్పల్ జోన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వసంత్‌కుమార్, సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

ధరణి కృష్ణ జాబ్ ఫ్రాడ్ కేసు..
హైదరాబాద్‌లో ఎపి సిఐడి సోదాలు

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త: ధరణి కృష్ణ జాబ్ ఫ్రాడ్స్ కేసులో ఏపీ సీఐడీ సోదాలు కొనసాగుతున్నాయి. జనసేన నేతల పేర్లు చెప్పి నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్టు ధరణి కృష్ణ అనే మహిళపై ఆరోపణలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. దేవాదాయ, పోలీస్ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆమె మోసానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ధరణి కృష్ణ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నట్టు సమాచారం రావడంతో ఏపీ సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. కూకట్‌పల్లిలోని ఓ న్యాయవాది కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నకిలీ గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు గుర్తించారు. కాగా బోడపాటి ధరణి కృష్ణ, నిమ్మకాయల పెద్దిరాజు తదితరులపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వీరు ఒకో బాధితుడి వద్ద రూ.15 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపణలు వస్తున్నాయి. కాగా కేసులో ఏ2గా ఉన్న నిమ్మకాయల పెద్దిరాజును సీఐడీ అధికారులు నవంబర్ 18న అరెస్టు చేశారు. పెద్దిరాజును గత గురువారం సాయంత్రం గుంటూరులోని సీఐడీ కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. పెద్దిరాజును హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సీఐడీ అదనపు డీఎస్పీ బి.సీతారామయ్య గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నేపాల్ ప్రధాని బాలేంద్రషా ఢిల్లీ రాక
నేడు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీతో భేటీ
ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు



న్యూఢిల్లీ, నవంబరు 22: నేపాల్ ప్రధాని బాలేంద్ర షా రెండు రోజుల భారత పర్యటన కోసం ఆదివారం మధ్యాహ్నం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఈ యేడాది మార్చిలో బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద స్వాగతం పలికారు. నేపాల్ ప్రధాని బాలేంద్ర ఆదివారం సాయంత్రం విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ఆయనకు లాంఛనప్రాయ స్వాగతం లభిస్తుంది. ముందుగా ఆయన రాజ్‌ఘాట్‌ను సందర్శించి, మహాత్మా గాంధీకి పుష్పాంజలి ఘటిస్తారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ ద్వైపాక్షిక చర్చల సందర్భంగా, ఇద్దరు నాయకులు భారత్- నేపాల్ సంబంధాలలోని అన్ని అంశాలను సమీక్షించడంతో పాటు, పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకుంటారు. ఇద్దరు ప్రధానులు కలిసి కొన్ని పూర్తయిన ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. అలాగే మరికొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. వివిధ రంగాలకు సంబంధించి కీలకమైన ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. ఈ యేడాది ప్రారంభంలో నేపాల్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ప్రధాని నరేంద్ర మోడీ, ప్రధాని బాలేంద్ర షాను భారత్‌ను సందర్శించవల సిందిగా ఆహ్వానించారు. దీనిని నేపాల్ పక్షం అంగీ కరించింది. ప్రధాని బాలేంద్ర షా చేపట్టిన మొదటి విదేశీ ద్వైపాక్షిక పర్యటన ఇదే.

గతంలో ఫోన్ సంభాషణలు, సందేశాల మార్పిడి తర్వాత, ఇద్దరు నాయకులు వ్యక్తిగ తంగా కలుసుకోవడం ఇదే మొదటిసారి. ఆర్థిక వృద్ధి, సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతికతను స్వీకరించడం, అలాగే ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో రెండు దేశాల జాతీయ ప్రాధాన్యతల మధ్య మంచి సమన్వయం ఉన్న తరుణంలో ఈ పర్యటన జరుగుతోంది. ఇద్దరు నాయకుల మధ్య జరిగే చర్చలు, రాబోయే సంవత్సరాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి దిశానిర్దేశం చేస్తాయని భావిస్తున్నారు. అభివృద్ధి భాగస్వామ్యం, ఇంధనం, జలవిద్యుత్, రైల్వేలు, అనుసంధానత (కనెక్టివిటీ), వాతావరణ మార్పులు, విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాలు, సాంకేతికత వంటి రంగాలలో కీలక ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

'అగ్నివీర్'లకూ పెళ్లిళ్లు
నిబంధనలు సడలించిన కేంద్రం
మహిళా అగ్నివీర్‌లకు ప్రసూతి సెలవులు
25శాతం మంది శాశ్వత సైనికులుగా మార్పు



న్యూఢిల్లీ, నవంబరు 22: అగ్నిపథ్ పథకం కింద ఎంపికైన అగ్నివీర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇటీవల పొడిగించిన రెండేళ్ల సర్వీస్ సమయంలో అగ్నివీర్లు వివాహం చేసుకునేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిబంధనల ప్రకారం అగ్నివీర్లు తమ తొలి నాలుగేళ్ల సర్వీసు కాలంలో వివాహం చేసుకోవడానికి వీలు లేదు. అయితే, ఇటీవల పొడిగించిన రెండేళ్ల సర్వీస్ సమయంలో పెళ్లి చేసుకునేందుకు కేంద్రం తాజాగా అనుమతి మంజూరు చేసింది.
అగ్నివీర్లు తమ నాలుగేళ్ల ప్రాథమిక సేవా కాలం ముగిసిన తర్వాత, పొడిగించిన రెండేళ్ల కాలంలో వివాహం చేసుకుని, ఆ సమయంలో గర్భవతులైతే, వారికి అన్ని రకాల ప్రసూతి ప్రయోజనాలు, సెలవులను వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అగ్నివీర్లు తమ మొదటి నాలుగేళ్ల సేవ పూర్తి చేసిన తర్వాత, పొడిగించిన రెండేళ్ల కాలంలో వివాహం చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతించడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. ప్రారంభ విధానం ప్రకారం, మొదటి నాలుగేళ్ల సేవా కాలంలో ఏ అగ్నివీరు కూడా వివాహం చేసుకోవడానికి అనుమతి లేదు. ఇప్పుడు, రెండవ విడతగా మరో రెండేళ్ల కాలానికి ఎంపికైన అగ్నివీర్లు, సుమారు నాలుగు వారాల (ఒక నెల) శిక్షణను పూర్తి చేసుకున్న తర్వాత వివాహం చేసుకోవచ్చు. అగ్నివీర్ విధానాన్ని 2022లో ప్రకటించారు. తాజా సవరణ ప్రకారం, 25శాతం మంది అగ్నివీర్లు శాశ్వత సైనికులుగా మారతారు, మిగిలిన 75శాతం మందికి మరో రెండేళ్ల పాటు సేవా కాలాన్ని పొడిగించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత వారు కూడా శాశ్వత సైనికులుగా చేరేందుకు అవకాశం ఉంటుంది. అగ్నివీర్లందరినీ శాశ్వత సైనికులుగా చేర్చుకునేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక విధాన నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, అగ్నివీర్లు తమ రెండేళ్ల పొడిగించిన సేవా కాలాన్ని పూర్తి చేసుకున్న తర్వాత, వారందరినీ శాశ్వత సైనికులుగా నియమిస్తామని ఉన్నత రక్షణ శాఖ అధికారులు తెలిపారు. అగ్నివీర్లందరూ భారత రక్షణ దళాలలో శాశ్వత సభ్యులుగా చేరేందుకు కేంద్ర మంత్రివర్గం అధికారికంగా ఒక పూర్తి మార్గాన్ని సిద్ధం చేసింది. రక్షణ దళాలు నిర్వహించిన నాలుగేళ్ల సమగ్ర పనితీరు మూల్యాంకనం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అగ్నివీర్ల సామర్థ్యం, శారీరక దృఢత్వం, స్ఫూర్తి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకునే సామర్థ్యంపై అత్యంత సానుకూల ఫలితాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర మంత్రివర్గ నిర్ణయం ప్రకారం, మొదట అనుకున్నట్లుగానే, ప్రతిభ ఆధారంగా 25శాతం మంది అగ్నివీర్లకు వెంటనే రక్షణ దళాలలో శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. మిగిలిన 75శాతం అగ్నివీర్ల కోసం, అభ్యర్థుల సుముఖత, భారత రక్షణ దళాల సిఫార్సుల ఆధారంగా, రెండు సంవత్సరాల అదనపు నియామక కాలాన్ని కేబినెట్ ఆమోదించింది. ఈ అదనపు రెండు సంవత్సరాల నియామక కాలం పూర్తయిన తర్వాత, అగ్నివీర్లందరికీ వారి సుముఖత, నిర్దిష్ట ఎంపిక ప్రమాణాలకు లోబడి, సాధారణ సైనికులుగా చేరే అవకాశం కల్పించబడుతుంది. ఈ రెండవ నియామక కాలంలో అధిక వేతనం, మెరుగైన సేవా నిధి ప్యాకేజీ, సంచిత సీనియారిటీ ప్రయోజనాలు లభిస్తాయి.

అంతరిక్షంలో నీటి బిందువులు..
నాసా వ్యోమగామి విడియో

న్యూయార్క్,నవంబరు 22: అంతరిక్షంలో మైక్రోగ్రావిటీ (అత్యల్ప గురుత్వాకర్షణ) పరిస్థితుల్లో ద్రవాలు ఎలా ప్రవర్తిస్తాయో వివరిస్తూ నాసా వ్యోమగామి డాన్ పెటిట్ ఒక అద్భుతమైన వీడియోను సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ లో పంచుకున్నారు. ఈ వీడియోలో విద్యుత్ ప్రభావం కలిగిన నీటి బిందువులు ఒక టెఫ్లాన్ అల్లిక సూది చుట్టూ కక్ష్యలో తిరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా భూమిపై గురుత్వాకర్షణ శక్తి ఎక్కువగా ఉండటం వల్ల నీటి బిందువులు నేరుగా కిందకు పడిపోతాయి. కానీ, అంతరిక్షంలోని భారరహిత స్థితిలో గురుత్వాకర్షణ ప్రభావం దాదాపుగా ఉండకపోవడంతో, స్థిరవిద్యుత్ శక్తులు ఆధిపత్యం చెలాయిస్తాయని పెటిట్ వివరించారు. ఈ ప్రయోగం కోసం డాన్ పెటిట్ ముందుగా ఒక కాగితంతో టెఫ్లాన్ సూదిని రుద్దడం ద్వారా దానికి విద్యుత్ ఆవేశాన్ని కలిగించారు. ఆ తర్వాత ఒక టెఫ్లాన్ సిరంజి సహాయంతో విద్యుత్ ఆవేశం ఉన్న నీటి బిందువులను సూది సమీపంలోకి వదిలారు. సూదిపై ఉన్న విద్యుత్ శక్తి ఆకర్షణ కారణంగా, ఆ నీటి చుక్కలు కిందకు పడిపోకుండా సూది చుట్టూ వృత్తాకార కక్ష్యలో తిరగడం ప్రారంభించాయి. ఈ దృశ్యాన్ని పైనుంచి చిత్రీకరించడం వల్ల, నీటి బిందువులు గ్రహాల మాదిరిగా సూది చుట్టూ ఒక ప్రత్యేకమైన కక్ష్య మార్గంలో ప్రదక్షిణలు చేస్తున్నట్లు అద్భుతంగా కనిపిస్తోంది.ఇలాంటి ప్రయోగాలు కేవలం మాడటానికి ఆశ్చర్యకరంగా ఉండటమే కాకుండా, అంతరిక్ష పరిశోధనల్లో ఎంతో కీలకమైనవిగా నిపుణులు భావిస్తున్నారు. భూమి అయస్కాంత క్షేత్రంలో విద్యుత్ ఆవేశ కణాలు ఎలా ప్రవర్తిస్తాయో అర్థం చేసుకోవడానికి ఇవి తోడ్పడతాయి. అంతేకాకుండా, భవిష్యత్తులో సుదూర అంతరిక్ష ప్రయాణాలకు అవసరమైన వ్యోమనౌకల ఇంధన నిర్వహణ వ్యవస్థలు, లైఫ్ సపోర్ట్ పరికరాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి ఈ తరహా పరిశోధనలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతూ సైన్స్ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



ఇందిరమ్మ సూక్తులు ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి
సోనియా గాంధీ ముందుమాట: తెలుగు ప్రచురణకర్త మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,నవంబరు 22,ప్రభాతవార్త: గాంధీ భవన్‌లో ఆదివారం కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ముందుమాట రాసిన ఇందిరమ్మ సూక్తులు తెలుగు పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పుస్తకాన్ని తెలుగులో ప్రచురించగా, ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బి.ఎం. సందీప్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఇతర పిఎసి సభ్యులు పాల్గొన్నారు.ఇంగ్లీషులో వచ్చిన ఇందిరా గాంధీ సెలెక్టెడ్ సేయింగ్స్‌ని తెలుగులో ఇందిరమ్మ సూక్తులు పేరుతో డా.పొన్నం రవిచంద్ర, డా. మామిడి హరికృష్ణ, లక్ష్మి అనువదించగా మంత్రి పొన్నంప్రభాకర్ వెలువరించారు. తొలుత ఈ పుస్తకాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ కన్నడ భాషలో వెలువరించారు.తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా యువతకు దివంగత మాజీప్రధాని ఇందిరా గాంధీ ఆలోచనలు, సందేశాలు, సూక్తులను చేరువ చేయాలనే ఉద్దేశంతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పుస్తకాన్ని తెలుగులో ప్రచురించారు .ఇందిరా గాంధీ ఆలోచనలు, ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేసే దిశగా ఇందిరమ్మ సూక్తులు పుస్తకం ఒక మంచి ప్రయత్నంగా నిలవనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.ఈ పుస్తకానికి సోనియా గాంధీ రాసిన ముందు మాట ప్రత్యేకఆకర్షణగా నిలుస్తోంది.ఇదిలా ఉంటే ఇందిరమ్మ సెలెక్టెడ్ సేయింగ్స్ పుస్తకం ఏభాషలో ప్రచురిస్తే ఆ ప్రచురణకర్తలు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి అందుకొంటున్నారని కాంగ్రెస్‌శ్రేణులు బలమైన మూఢ విశ్వాసం ఉంది.

తెలంగాణకు తగ్గిన పంచాయతీ నిధులు

హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త: తెలంగాణ పంచాయతీ వ్యయం గత మూడేళ్లుగా గణనీయంగా తగ్గిందని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఒక్కో పంచాయతీపై సగటు వ్యయం 2022-23లో రూ.16.59 లక్షల నుంచి 2024-25 నాటికి రూ.6.24 లక్షలకు పడిపోయిందని రిజర్వ్ బ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది. పంచాయతీ రాజ్ సంస్థల ఆర్థిక వ్యవహారాలు గ్రామీణ భారతదేశంలో స్థానిక ఆర్థిక వనరులు, సామర్థ్య నిర్మాణం అనే నివేదిక ప్రకారం, తెలంగాణలో ఒక్కో పంచాయతీపై వ్యయం 2022-23లో రూ.16,59,762, 2023-24లో రూ.15,43,813, 2024-25లో రూ.6,24,655గా ఉన్నట్లు తెలిపింది. ఈ కాలంలో రాష్ట్రంలోని ప్రతి పంచాయతీకి వచ్చే రాబడి కూడా 2022-23లో రూ.16,72,221 నుండి 2023-24లో రూ.14,38,083కి, 2024-25లో రూ.4,42,467కి తగ్గిట్లు వివరించింది. ఈ రాబడిలో గ్రాంట్ల వాటా ప్రధానంగా ఉందని పేర్కొంది. ఇవి వరుసగా రూ.14,34,369 నుండి రూ.12,41,362, రూ.2,80,955కి తగ్గాయని వివరించింది. గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉన్న మొత్తం వనరులలో ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే గ్రాంట్లు, వాటి సొంత వసూళ్లు ఉంటాయి. జాతీయంగా, 2022-23 నుండి 2024-25 మధ్య కాలంలో ఒక్కో పంచాయతీకి సగటు రాబడి సుమారు రూ.21.3 లక్షలు, వ్యయం రూ.21.5 లక్షలుగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఈ మూడు సంవత్సరాల లోనూ రాబడి, వ్యయం రెండింటిలోనూ తెలంగాణ జాతీయ సగటు కంటే వెనుకబడి ఉందని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం, కేంద్ర ప్రభుత్వ నిధుల విడుదల ఆలస్యం కావడం నేపథ్యంలో ఈ తగ్గుదల చోటుచేసుకుందని పేర్కొంది. ఈ కాలంలో తెలంగాణ పంచాయతీలు ద్రవ్య మిగులు నుండి లోటులోకి మారాయని ఆర్‌బిఐ నివేదిక పేర్కొంది. 2022-23 నుండి 2024-25 వరకు, ద్రవ్య బ్యాలెన్స్ సగటున 1.7 శాతం లోటును నమోదు చేసిందని వెల్లడించింది.

రూ.16.60 లక్షల నుంచి రూ.6.25 లక్షలకు తగ్గుదల
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం కారణం
స్పష్టం చేసిన రిజర్వ్ బ్యాంక్ నివేదిక

ఇక ఇఎస్ఐ క్లెయిమ్‌లు మరింత సులభతరం..
కొత్త నిబంధనలు నోటిఫై చేసిన ఇఎస్ఐసి

న్యూఢిల్లీ,నవంబరు 22: ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే కార్మికులు, ఉద్యోగుల క్లెయిమ్‌లకు సంబంధించిన నిబంధనలను కార్మిక రాజ్యబీమా సంస్థ సులభతరం చేసింది. ఈ మేరకు అనారోగ్య, ప్రసూతి ప్రయోజనాలకు సంబంధించిన నిబంధనలను సవరించింది. సామాజిక భద్రత కోడ్, 2020ను అనుసరించి 1950 నాటి పాత నిబంధనల స్థానంలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ రెగ్యులేషన్స్ 2026ను ఈఎస్ఐసి ఆదివారం నోటిఫై చేసింది. ఎలాంటి పేపర్ వర్క్ లేకుండానే కార్మికులు, ఉద్యోగులు డీబీటీ ద్వారా ఆన్‌లైన్‌లో నిధులు పొందొచ్చు. అనారోగ్యం, మెటర్నిటీ క్లెయిమ్‌లను ఇకపై ఆటోమేటిక్‌గా ప్రాసెస్ చేస్తారు. ఇందుకు ఈఎస్ఐకి చెందిన ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా మెడికల్ సర్టిఫికెట్ జారీ అయి ఉండాలి. యజమాని తన పోర్టల్ ద్వారా నెలవారీ రిటర్న్‌ను సమర్పించాలి. కార్మికుడి బీమా నంబర్‌తో పాటు బ్యాంకు ఖాతా కూడా ఆధార్‌తో అనుసంధానమై ఉంటే నేరుగా ఖాతాలోకి నిధులు జమ అవుతాయి. ఈ ప్రయోజనాల కోసం విడిగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. పని ప్రదేశంలో జరిగే ప్రమాదాలకు సంబంధించిన క్లెయిమ్‌లకు సంబంధించిన నిబంధనలూ ఈఎస్ఐసీ సడలించింది. తాత్కాలిక వైకల్యం, శాశ్వత వైకల్యం లేదా మరణం వంటి సందర్భాల్లో యజమాని ఆన్‌లైన్‌లో రిపోర్టు చేయాలి. ఆపై కార్మికుడి కుటుంబ సభ్యులు తొలి పేమెంట్ కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఇకపై పని ప్రదేశంలో యజమాని నుంచి ఆన్‌లైన్‌లో రిపోర్టు అందగానే వేరే అప్లికేషన్‌తో సంబంధం లేకుండా ఈఎస్ఐసీ నగదు చెల్లింపు చేస్తుంది. అవసరమైతే కార్మికులు స్వయంగా కూడా క్లెయిమ్ దాఖలు చేయవచ్చు. బీమా పరిధిలోకి వచ్చే మహిళా కార్మికులకు మాతృత్వ సమయంలో నూరు శాతం సగటు రోజువారీ వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేస్తోంది. ఇద్దరు పిల్లల వరకు 26 వారాలు, ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలు ఉన్నా, దత్తత తీసుకున్నా 12 వారాల వేతనాన్ని ఈఎస్ఐసీ చెల్లిస్తుంది. ఈ ప్రసూతి ప్రయోజనాలను డెలివరీకి ముందు క్లెయిమ్ చేసుకునే గడువును తాజాగా 50 రోజుల నుంచి 56 రోజులకు పెంచారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న మహిళా కార్మికులకు ఇది 42 రోజుల వరకు ఉంటుంది. అనారోగ్య ప్రయోజనాలను 7 రోజుల్లోపు, మెటర్నిటీ ప్రయోజనాల మొదటి వాయిదాను 14 రోజుల్లోపు చెల్లించాలనే నిబంధన యథాతథంగా కొనసాగుతుంది. 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న సంస్థలు ఈఎస్ఐ పరిధిలోకి వస్తాయి. నెలవారీ వేతనం రూ.21వేల్లోపు, దివ్యాంగులైతే రూ.25వేలు సంపాదిస్తున్నవారు ఈఎస్ఐలో సభ్యుడిగా చేరొచ్చు. దేశవ్యాప్తంగా దాదాపు 4 కోట్

వార్త

ఆపదలు రెండు రకాలు. ఒకరకం మనకు దురదృష్టాన్ని తెచ్చిపెడితే, ఇంకోరకం ఇతరులకు అదృష్టాన్ని ఆర్జించిపెడుతుంది.

న- ఆంబ్రోస్ బియర్స్

'అణు'వంత శాంతినైనా సాధించాయా?

చైనా టెక్నాలజీ కేంద్రమైన షెన్‌జెన్‌లోని ఒక విల్లాలో జరిగిన ఈ సమావేశానికి ముందు, ట్రంప్ ఇద్దరు నాయకులను స్నేహితులుగా అభివర్ణించడానికి ప్రత్యేకంగా ప్రయత్నించారు. ఉక్రెయిన్, ఇరాన్‌లలో యుద్ధాలు, అణ్వాయుధ నియంత్రణ, ప్రపంచంలోనే అతిపెద్ద అణ్వాయుధాల వల్ల కలిగే ముప్పును తగ్గించే మార్గాలు. కానీ సుమారు 70 నిమిషాల పాటు జరిగిన రహస్య చర్చల తర్వాత, ఆ ముగ్గురు నాయకులు సహకారం కోసం చాలా పరిమితమైన రంగాలను మాత్రమే ప్రతిపాదించారు.ఐక్యరాజ్యసమితిని సంస్కరించడం, శిలాజ ఇంధనాలఉత్పత్తిని విస్తరించడం,అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పరిధిని పరిమితం చేయడం వంటి అంశాలపై ఆసక్తిని వ్యక్తం చేశారు. ఘర్షణలను, ఉద్రిక్తలను తగ్గించడంలో తమవంతు పాత్రను ప్రస్తావించని ఈ ముగ్గురు నేతలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు తన అధికార పరిధిని అతిక్రమిస్తోందని ఆరోపిస్తూ దానిపై దాడిచేయడంలో మాత్రం ఒకే అభిప్రాయం వ్యక్తం చేశారు.



చలసాని నరేంద్ర

అమెరికా, చైనా, రష్యా అగ్రనాయకులు మొదటిసారిగా చైనాలో సమావేశమవుతూ ఉండటంతో నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న కీలకమైన సంక్షోభాల పరిష్కారంలో ఓ మార్గం ఏర్పడగలదని చాలామందిఆశించారు. చైనా, రష్యా నాయకులను ఒకచోట చేర్చడం ఒక దౌత్య విజయంగా నిలుస్తుందని, వాషింగ్టన్‌కు అత్యంత బలమైన ప్రత్యర్థులైన ఇద్దరితో సంప్రదింపులు జరపగల తన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశించారు. కానీ, షీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్‌లతో జరిగిన అపూర్వమైన త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం,విస్తృత ప్రకటనలు, జాగ్రత్తగా ప్రదర్శించిన స్నేహపూర్వక వాతావరణంతో ముగిసింది. ఐక్యరాజ్యసమితి సంస్కరణలు,చమురు సరఫరా, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు, అణు ప్రమాదాలపై ఈ ముగ్గురు నాయకులు నాలుగు సూత్రాల ప్రకటనను జారీ చేశారు. అయితే, ఎటువంటి కార్యాచరణను ప్రకటించలేదు. ముఖ్యంగా నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత దారుణమైన సంక్షోభంగా రష్యా,ఉక్రెయిన్ యుద్ధం, మధ్య ఆసియాలో ఇరాన్ యుద్ధం వంటి విషయాలలో ఎటువంటి నిర్దుష్టమైన సందేశం కూడా ఇవ్వలేకపోయారు. ఇంధన భద్రత, ఐరాస సంస్కరణలు, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై సైతం గురించి మాటలు తప్ప ఎటువంటి నిర్దుష్టమైన భరోసాలు ఇవ్వలేకపోయారు.నేటి ప్రపంచంఎదుర్కొంటున్న అనేక సంక్షోభాలు, అశాంతి, ఘర్షణలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ మూడు దేశాల ప్రమేయం ఉంటున్నది. అందుకనే వారి భేటీ ఈ అంశాలలో ఈ మూడుదేశాలు ఉమ్మడిగా ఓ కార్యాచరణను ప్రకటిస్తారని చాలామంది ఎదురుచూశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఆసియా పర్యటనలోని కీలక దశను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో వేర్వేరు సమావేశాలతో ముగించారు. ఆ తర్వాత ప్రపంచంలోని మూడు అతిపెద్ద అణుశక్తి దేశాల నాయకులతో అపూర్వమైన త్రైపాక్షిక సమావేశం జరిగింది. అయితే, ఈ దౌత్య ప్రదర్శన ఉన్నప్పటికీ, ఉక్రెయిన్, ఇరాన్‌లలో యుద్ధాలు, అణ్వాయుధ నియంత్రణ లేదా వాణిజ్యంపై ఈ సమావేశాలు కొన్ని నిర్దిష్ట పురోగతులను మాత్రమే సాధించాయి. షెన్‌జెన్‌లో జరిగిన ఆసియాపసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఏపీఈసీ) సమావేశం సందర్భంగా నిర్వహించిన ఈ శిఖరాగ్ర సమావేశం, వాషింగ్టన్ రెండు అతిపెద్ద భౌగోళిక రాజకీయ ప్రత్యర్థులతో తన వ్యక్తిగత సంబంధాలను ప్రదర్శించడానికి ట్రంప్‌కు ఒకఅవకాశాన్ని కల్పించింది.అయితే,ఆయన ఆశయాలకు, ఆ మూడు దేశాలు కట్టుబడి ఉండటానికి సిద్ధంగా ఉన్న విషయాలకు మధ్య ఉన్న అంతరాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. చైనా టెక్నాలజీ కేంద్రమైన షెన్‌జెన్‌లోని ఒక విల్లాలో జరిగిన ఈ సమావేశానికి ముందు, ట్రంప్ ఇద్దరు నాయకులను స్నేహితులుగా అభివర్ణించడానికి ప్రత్యేకంగా ప్రయత్నించారు. ఉక్రెయిన్, ఇరాన్‌లలో యుద్ధాలు, అణ్వాయుధ నియంత్రణ, ప్రపంచంలోనే అతిపెద్ద అణ్వాయుధాల వల్ల కలిగే ముప్పును తగ్గించే మార్గాలు. కానీ సుమారు 70 నిమిషాల పాటు జరిగిన రహస్య చర్చల తర్వాత, ఆ ముగ్గురు నాయకులు సహకారం కోసం చాలా పరిమితమైన రంగాలను మాత్రమే ప్రతిపాదించారు. ఐక్యరాజ్యసమితిని సంస్కరించడం, శిలాజ ఇంధనాల ఉత్పత్తిని విస్తరించడం, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పరిధిని పరిమితం చేయడం వంటి అంశాలపై ఆసక్తిని వ్యక్తం చేశారు. ఘర్షణలను, ఉద్రిక్తలను తగ్గించడంలో తమవంతు పాత్రను ప్రస్తావించని ఈ ముగ్గురు నేతలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు తన అధికార పరిధినిఅతిక్రమిస్తోందని ఆరోపిస్తూ దానిపై దాడి చేయడంలో మాత్రం ఒకే అభిప్రా



యం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు ఆ ట్రిబ్యునల్ ముందు విచారణ నుంచి మినహాయింపు ఉండాలని వాదిస్తూ, ఆ ముగ్గురు నాయకులు దానిపై విమర్శల విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. ఐసిసికి వాంటెడ్ వ్యక్తిగా ఉన్న పుతిన్‌కు ఈ వైఖరి ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. మరోవైపు, ట్రంప్ ప్రభుత్వం, అమెరికా, ఇజ్రాయెల్‌తో సహా దాని మిత్రదేశాలకు సంబంధించిన దర్యాప్తులకు వ్యతిరేకంగా సాగిస్తున్న విస్తృత ప్రచారంలో భాగంగా, ఆ కోర్టుపైనా, దానిలోని కొంతమంది అధికారులపైనా ఆంక్షలు విధించింది. తద్వారా తమ నేరాలను, ఉల్లంఘనలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం ఈ ముగ్గురు చేస్తున్నట్టు స్పష్టం అవుతుంది. చారిత్రాత్మక దౌత్య సమావేశంగా ప్రచారం చేసిన ఈ కార్యక్రమం, చివరికి ఒక ఆర్భాటమైన ఫోటో సెషన్‌లా మాత్రమే కనిపించింది. ట్రంప్ చర్చల గురించి విలేకరులతో మాట్లాడకుండానే విల్లా నుండి బయలుదేరి ఎయిర్ ఫోర్స్ వన్ విమానం ఎక్కారు.ఈ శిఖరాగ్ర సమావేశానికి ముందు జరిగిన గొప్ప ప్రసంగాలకు, వచ్చిన ఈ సామాన్య ఫలితం పూర్తి విరుద్ధంగా ఉంది.'మనం నిజంగా చరిత్ర సృష్టిస్తున్నాం' అని ట్రంప్ ప్రారంభంలోనే ప్రకటించారు. భూమిపై అణ్వాయుధాల సంఖ్యను ఎలాతగ్గించాలి? అలాగే ఆ ఆయుధాలను ఉపయోగించే ప్రమాదాన్ని ఎలా తగ్గించాలి? అనే విషయాలపై చర్చించడానికి అమెరికా, రష్యా, చైనాలు ప్రత్యేకమైన స్థితిలో ఉన్నాయి.ఈ సమావేశం 'ప్రపంచ శాంతిని ప్రోత్సహించడం'పై దృష్టి సారిస్తుందని జిన్‌పింగ్ చెప్పగా, అంతర్జాతీయ శాంతిని కాపాడ టంలో మూడు దేశాలకూ ఉమ్మడి బాధ్యత ఉందని పుతిన్ నొక్కి చెప్పారు. సమావేశం అనంతరం, జిన్‌పింగ్ ఈ చర్చ లను సానుకూలమైనవిగా, నిర్మాణాత్మకమైనవిగా, ఫలవంత మైనవిగా అభివర్ణించారు. పుతిన్ వాటిని బహిరంగంగా, నిష్కపటంగా జరిగాయని పేర్కొంటూ, ఈ త్రైపాక్షిక సమావేశ విధానాన్ని 'ఉపయోగకరమైనది, సారాంశంతో కూడినది'గా పేర్కొన్నారు. సమావేశం వాస్తవఫలితం కంటే దాని ప్రతీకాత్మకతకే ఎక్కువ ప్రాధాన్యత ఉందా? అని అడిగిన ప్పుడు, ఇది ఒక గంభీరమైన దౌత్యపరమైన నిబద్ధతకు నిదర్శనమని పుతిన్ నొక్కిచెప్పారు. ప్రపంచ అణ్వాయుధ నియంత్రణకు అత్యంత సున్నితమైన తరుణంలో ఈ శిఖరాగ్ర సమావేశం జరిగింది. వాషింగ్టన్,మాస్కోల మధ్య మిగిలి ఉన్న చివరి అణ్వాయుధ ఒప్పందం, న్యూ స్టార్ట్ ఒప్పందం, ఫిబ్రవరిలో గడువు ముగిసింది. చైనాను కూడా చేర్చుకునే 'కొత్త, మెరుగైన, ఆధునిక' ఒప్పందం తనకు కావాలని ట్రంప్ చెప్పారు. అయితే, బీజింగ్ తన అణ్వా యుధాలపై ఆంక్షలను అంగీకరించడానికి సుముఖంగా ఉన్న ట్లు కనిపించడం లేదు. చైనా వద్ద 600 కంటే ఎక్కువ వార్‌హెడ్‌లు ఉన్నాయని అంచనా. ఇది అమెరికా, రష్యాల వద్ద చెరో 5,000 కంటే ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్న దానికంటే చాలా తక్కువ. ఈ ముగ్గురు నాయకుల మధ్య జరిగిన వేర్వేరు సమావేశాల తర్వాత ఈ త్రైపాక్షిక సమావేశం జరిగింది. వారి చర్చలలో ఇరాన్, ఇంధన సరఫరాలు, వాణిజ్యం, ఉక్రెయిన్‌లోని యుద్ధం ప్రధానాంశాలుగా నిలిచాయి. జిన్‌పింగ్‌తో ట్రంప్ జరిపిన ఈ ద్వైపాక్షిక సమావేశం, ఈ సంవత్సరంలో వారిద్దరి మధ్య జరిగిన మూడవ ముఖ్యమైన సమావేశం. ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైన రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధి గుండా చమురు నిరంతరాయంగా ప్రవహించడంలో ఇరుదేశాలకు ఉమ్మడి ప్రయోజనంఉందని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. ఇరాన్ యుద్ధ సమయంలో జరిగిన దాడులవల్ల ఈ మార్గం పదేపదే అంతరాయానికి గురైందని ఆయన తెలి పారు. మరి న్ని అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని బీజింగ్‌పై ఒత్తిడి తెస్తానని కూడా ఆయన సూచించారు. జిన్‌పింగ్ని ట్రంప్ బహిరంగంగా ప్రశంసించినప్పటికీ, తన స్నేహితుడు అంటూ పేర్కొన్నప్పటికీ ఈ భేటీ సందర్భంగా జరిగిన కార్యకలాపాలు, బీజింగ్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలకు సంబంధించిన సంకేతాలను కూడా అందించాయి. స్నేహం, చారిత్రక సహకారం గురించి ఎంతగా మాట్లాడినప్పటికీ, ఈ మూడు అగ్రరాజ్యాలను వేరుచేస్తున్న వ్యూహాత్మక విభేదాలను కేవలం వ్యక్తిగత దౌత్యం ద్వారా మాత్రమే అధిగమించవచ్చనడానికి ఈ శిఖరాగ్ర సమావేశం ఎటువంటి ఆశాజనక సంకేతాలు ఇవ్వలేకపోయింది.

'పౌల్ట్రీ'కి కొత్త ఊపిరి!

ఒకప్పుడు కోళ్లకు తెగులు వచ్చిందంటే వాటిని సజీవంగా, సామూహికంగా భూస్థాపితం చేయడం తప్ప వేరే గత్యంతరం ఉండేది కాదు. ఏ మాత్రంపొరపాటున కోళ్లను వండి తిందామని ప్రయత్నం చేసినా చావు పలకరించి వెళ్లేది. మానవాళి పక్షులతోనీ, జంతువులతోటి సహజీవనం చేస్తుండడం చూస్తూంటాం.అలాసంక్రమించు వ్యాధులను జునోసిస్ వ్యాధులుగా చెబుతూ ఉంటాం. బర్డ్ ఫ్లూ అనేది పక్షులకు సోకే వైరస్ వ్యాధి.ముఖ్యంగా ఈ వైరస్ రకాలు కోళ్లు, బాతులు, టర్కీలు, ఇతర పక్షులకు తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తాయి. భారత దేశ పౌల్ట్రీ పరిశ్రమ ప్రజారోగ్య భద్రతకు ఒక చారిత్రాత్మక మలుపుగా, కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ శుక్రవారం భోపాల్‌లో దేశపు మొట్టమొదటి స్వదేశీ హెచ్ 5 ఎన్ ఐ బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా) వ్యాక్సిన్‌ను జాతికి అంకితం చేశారు.భోపాల్‌లోని ఐసిఏఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు దీనిని అభివృద్ధి చేశారు. కేవలం రూపాయి నుండి రెండు రూపాయల అతి తక్కువ ధరకే ఒకడోసు లభించేలా రూపొందించిన ఈ టీకా, చిన్న,సన్నకారు పౌల్ట్రీ రైతులకు పెద్ద ఊరటనిచ్చే పరిణామం.ఈ వ్యాక్సిన్ ఆవిష్కరణ భారత పౌల్ట్రీరంగానికి ఒక రక్షణ కవచం. చాన్నాళ్లుగా బర్డ్‌ఫ్లూవ్యాధిని నిరోధకశక్తితో రూపుమాపాలని చేపట్టిన ఏప్రయత్నమూ సానుకూల పడలేదు.ఐనా భారతీయ శాస్త్రజ్ఞులు పట్టు విడువలేదు. ఈ అంశంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు ఈ అంశంలో అన్నీ ఇన్నీ కావు. హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా అనేది పక్షులలో అత్యంత వేగంగా వ్యాపించే ప్రాణాంతకవైరస్. దీనివల్ల సోకిన కోళ్లలో దాదాపు 100 శాతం మరణాలు సంభవించే ప్రమాదం ఉంటుంది. భారత్‌లో మొదటిసారిగా 2006లో 'బర్డ్‌ఫ్లూ' ప్రబలినప్పటి నుండి, దాదాపు ప్రతిఏటా వివిధ రాష్ట్రాల్లో ఈవైరస్ కలకలంరేపుతోంది. నాటి వ్యాప్తివల్లే దేశానికి సుమారు 2,200 నుండి 3 వేల కోట్ల మేర ప్రత్యక్ష, పరోక్ష నష్టాలు వాటిల్లాయి. ఇప్పటివరకు మన దేశంలో వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో, వైరస్ బయటపడిన ప్రాంతాల్లో లక్షలాది కోళ్లను సామూహికంగా వధించి పూడ్చిపెట్టడం ఒక్కటే మార్గంగా ఉండేది. దీనివల్ల పౌల్ట్రీ రైతులు కోలుకోలేని ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయేవారు. మన దేశంలోని చిత్తడి నేలలకు శీతాకాలంలో వచ్చే వలస పక్షులద్వారా, సెంట్రల్ ఏషియన్ ఫ్లైవే ద్వారా ఈ వైరస్ తరచుగా దేశీయ పౌల్ట్రీకి వ్యాపిస్తుంది. ముఖ్యంగా భారత దేశంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతున్న క్లేడ్ 2.3.2.1 రకంహెచ్ 5 ఎన్ ఐ వైరస్‌ను అడ్డుకోవడానికి ఇప్పటివరకు మన వద్ద నిర్దిష్టమైన వాణిజ్య టీకా లేదు. హెచ్ 5ఎన్ ఐ కేవలం పక్షులకే పరిమితం కాకుండా,క్షీరదాలకు, మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉండటం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ నియంత్రణలో భారత్ అనుసరించిన 'మాస్‌కల్లింగ్' విధానం కేవలం వ్యాధి వ్యాప్తిని తాత్కాలికంగా ఆపడానికి మాత్రమే ఉపయోగపడింది తప్ప, రైతుల జీవనోపాధిని కాపాడలేకపోయింది. ఇప్పుడు స్వదేశీ ఇనాక్టివేటెడ్ టీకా అందుబాటులోకి రావడం వల్ల, వ్యాధి రాకముందేకోళ్లకు రోగనిరోధక శక్తిని కల్పించే నివారణ వ్యూహానికి బాటలు పడ్డాయి. ఇది ఆహార భద్రతను,చౌకైన ప్రోటీన్ గుడ్లు, చికెన్ సరఫరాను స్థిరీకరిస్తుంది. విదేశీ టీకాలపై ఆధార పడకుండా, మన దేశ పరిస్థితులకు, ఇక్కడ చురుకుగా ఉన్న 'క్లేడ్ 2.3.2.1' వైరస్‌కు సరిపోయేలా సొంతంగా వ్యాక్సిన్‌ను రూపొందించడం పశువైద్య బయోటెక్నాలజీ రంగంలో భారత్ సాధించిన గొప్ప విజయం. తెలుగు రాష్ట్రాల వంటి పౌల్ట్రీ పరిశ్రమ అత్యధికంగా ఉన్న ప్రాంతాలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. పశు పక్ష్యాదుల ఆరోగ్యం, మానవ ఆరోగ్యం, పర్యావరణం ఒక దానితో ఒకటి ముడిపడి ఉంటాయి. కోళ్లలో వైరస్ వృద్ధి ని, వాతావరణంలోకి వైరస్ విడుదలను ఈ టీకా అడ్డు కోవడం ద్వారా, వైరస్ రూపాంతరం చెంది మనుషులకు సోకే ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు.టీకా ఆవిష్కరణ మొదటి అడుగు మాత్రమే. క్షేత్రస్థాయిలో దీనిని విజయవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం, పౌల్ట్రీరంగం కొన్ని కీలక అంశాలపై దృష్టిపెట్టాలి. ఇప్పటి వరకు ఉన్నజాతీయ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం క్షేత్ర స్థాయిలో బర్డ్‌ఫ్లూ టీకాలపై ఆంక్షలుండేవి. వాణిజ్యపరమైన అనుమతులు, లైసెన్సింగ్, టీకాపంపిణీ మార్గదర్శకాలను పశుసంవర్ధక శాఖవేగంగా సవరించాల్సి ఉంది. ఈటీకాను 2 సెంటీగ్రేడ్ నుండి 8 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయాల్సి ఉంటుంది. పెద్దపౌల్ట్రీ ఫారాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కోట్లాది పెరటి కోళ్లకు ఈ టీకాను చేర్చ డానికి బలమైన శీతల గిడ్డంగుల వ్యవస్థ, పశువైద్య సిబ్బంది అవసరం. ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా వైరస్‌లు నిరంతరం రూపాంతరం చెందుతుంటాయి. వ్యాక్సిన్ తీసుకున్న పక్షులకు కూడా వైరస్ సోకే అవకాశం ఉంటుంది. బర్డ్‌ఫ్లూ వైరస్‌లో మార్పులు సంభవిస్తాయి. అందువల్ల ఉపయోగించే వ్యాక్సిన్ కొత్త వైరస్ రకానికి సరిపోకపోవచ్చు. వ్యాక్సిన్ తీసుకున్న పక్షుల్లో వ్యాధిలక్ష ణాలు కనిపించకపోయినా వైరస్ ఉండవచ్చు. అవి ఇతర పక్షులకు వ్యాధిని వ్యాపింప జేయవచ్చు. ప్రపంచవ్యా ప్తంగా వ్యాపిస్తున్న 'క్లేడ్ 2.3.4.4' వంటి కొత్త రకాలు మన దేశంలోకి ప్రవేశిస్తే, అందుకు అనుగుణంగా టీకాను ఎప్పటికప్పుడు నవీకరించే నిఘావ్యవస్థ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సరైన నియంత్రణ, పటిష్టమైన బయోసెక్యూరిటీ చర్యలతో దీనిని రైతులకు అందుబాటులోకి తెస్తే, బర్డ్ ఫ్లూ భయాలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

ప్రభుత్వ విద్యాసంస్థలకు ఏవీ మంచిరోజులు!

జన్నాభట్ల నరసింహ ప్రసాద్

మన ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం విద్యాశాఖకు కోట్ల రూపాయలు కేటాయించి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నా ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుకొనే విద్యార్థుల సంఖ్య నానాటికీ తీసికట్టు నాగంబొట్టు లాగా తయారవుతున్నది. గత 50 సంవత్సరాల నుంచి ఇదే తంతు నడుస్తున్నది. ప్రతి విద్యాసంవత్సరం ఆరంభంలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులచే గొప్పగా ఉపన్యాసాలు ఇచ్చి పాఠశాలలను, హైస్కూళ్లను,జూనియర్ కాలేజీలను ప్రారంభిస్తున్నారు. ఒక వారం తర్వాత ఆయా విద్యాసంస్థల ముఖం చూసే దిక్కే ఉండరు. విద్యాలయాల లో పనిచేసే ఉపాధ్యాయులకు కావలసిన నిష్పత్తిలో విద్యార్థుల హాజరు తక్కువై ప్రతి సంవత్సరం కొన్నివేల ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తున్నారు. దీని పరిణామం వలన మారుమూల, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వారికి చదువుకునే అవకాశాలు మృగ్యమైపోతున్నాయి. అదే సమయంలో కార్పొరేట్ విద్యాసంస్థలు మూడుపువ్వులు,ఆరుకాయలతో అభివృద్ధి పథంలో ముందుకుపోతున్నాయి. పట్టణాలలో ప్రతిమూడు కిలోమీటర్ల దూరంలో కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టి కొత్త బ్రాంచిలను ప్రారంభిస్తున్నారు. అంతేగాక ఇప్పుడు ప్రతిమండలానికి నాలుగైదు ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయి. రవాణా సౌకర్యాలను ప్రతి విద్యార్థి ఇంటి ముందుకు తెస్తున్నారు.సౌకర్యాలూ బాధ్యతగల క్రమశిక్షణ, సుశిక్షితమైన విద్యాబోధన తమ పిల్లలకు అందుబాటులో ఉన్నందున తల్లిదండ్రులు ఖర్చుకు వెనుకాడకున్నా ఫీజులు ఎంతైనా చెల్లిస్తూ అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వాలు విద్య కొరకు ఖర్చు చేస్తున్న ప్రజాధనం వృధాగా పోవడం ఎవ్వరూ గమనించడం లేదు. అదే దురదృష్టం. ప్రభుత్వ విద్యాసంస్థలు నీరుగారిపోవటానికి చాలాకారణాలున్నాయి. వాటిని అధిగమించడానికి విద్యాలయాల నియంత్రణపై క్రమశిక్షణ కలిగి ఉండాలి.ప్రిన్సిపాల్, హెడ్ మాస్టర్‌కు విశేష అధికారాలు ఇవ్వాలి.విద్యాలయాల్లో పనిచేసేటీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు తాము తీసుకునే జీతానికి తగినట్లుగా కష్టపడి నిజాయితీగా పని చేయాలి. ప్రభుత్వాలు విద్యాలయాలలో పనిచేసేవారికి ఇతర ప్రభుత్వ నిర్వహణ పర్యవేక్షణ పనులకు నియమించడం తగ్గించాలి. అత్యవసరమైతేనే వారిని వాడుకోవాలి లేని పక్షంలో విద్యార్థులకు అవసరమైన సిలబస్ బోధించడానికి సమయం ఉండదు. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడతారు. ప్రతి గ్రామ, మండలం, మున్సిపాలిటీలలోని ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వవిద్యాసంస్థలలోనే చేర్పించాలి. ఉపాధ్యాయులు ప్రభుత్వ అధికా రులు తమ పిల్లలను తమకు అనుకూలమైన ప్రాంతాల లోని ప్రభుత్వ విద్యాలయాలలో చేర్పించి చదివించాలి. అప్పుడే అక్కడ పనిచేస్తున్న సిబ్బందిలో బాధ్యత కలిగి సక్రమంగా పనిచేసే అవకాశం ఉన్నది. ప్రభుత్వ విద్యా సంస్థల నిర్వహణలో రాజకీయ పార్టీ, నాయకుల జోక్యం ఉండకూడదు. ఉపాధ్యాయులకు తదితర సిబ్బందికి భద్రత కూడా కల్పించాలి.

సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు. తక్కినవారు వారిని అనుసరిస్తూ ఉంటారు.



రాధాకృష్ణన్

నేనే ఆచరించనిదాన్ని ఇతరులకు ఆచరించమని చెప్పడం నా జీవిత సూత్రాలకు విరుద్ధం.



మహాత్మా గాంధీ

ప్రజావాక్కు



క్షయవ్యాధి రహిత భారతం ఎంత దూరం?

వైద్యశాస్త్రం ఎన్నో అద్భుతాలు సాధించినా క్షయవ్యాధి ఇప్పటికీలక్షలాది ప్రాణాలను బలితీసుకుంటోంది. చికిత్సతో నయం చేయగలవ్యాధి ఇంతకాలం కొనసాగుతుండటం ప్రజారోగ్య వ్యవస్థకు తీవ్రమైన సవాలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజానివేదిక ప్రకారం2025లో ప్రపంచ వ్యాప్తంగా కోటీ ఆరు లక్షల మందికి క్షయవ్యాధి సోకగా, 11.3లక్షలమంది మరణించారు.గుర్తించని రోగులు ఇంకా లక్షల్లో ఉండటం వ్యాధి నిర్మూలన లక్ష్యానికి పెద్ద అవరోధం.రోగాన్ని ఆలస్యంగా గుర్తిస్తే బాధితుడి ఆరోగ్యం తోపాటు కుటుంబ సభ్యుల భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. భారత్‌లో పురోగతి ఆశాజనకమే. 2015తో పోలిస్తే 2025 నాటికి క్షయవ్యాధి మరణాల రేటు 38 శాతం తగ్గింది. వేగవంతమైన పరీక్షలు, ఉచిత మందులు, ఇంటింటి ఆరోగ్య సర్వేలు, పోషకాహార సహాయం ఇందుకు దోహదపడ్డాయి. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కొత్త కేసుల్లో దాదాపు నాలుగో వంతు భారత్‌లోనే ఉండటం ఆందోళనకరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

బ్యాంకుల వారి కంటే జేబులు కొట్టేవాళ్ళు నయం

గతంలో బ్యాంకులో ఒక వందరూపాయలు వేస్తే, అప్పుడపుడు రూపాయి, రెండురూపాయలు వడ్డీ కలిపేవారు. ఇప్పుడు ఆ కటింగ్ ఈ కటింగ్ అంటూ ఆ వంద కాస్త కాజేస్తున్నారు. ఈమధ్య ఎక్కువకాలంతియ్యడం వేయడం జరగకపోతే ఇనాపరేట్ అంటూ మూసివేస్తున్నారు. మరల వెళ్ళినపుడు, మరల తెరచినట్లు రాస్తారు. దానికి కొంత కట్ చేస్తారు. ఇదేమిటి?అవసరం వచ్చినపుడు బ్యాంకుకు వెళ్ళి లావాదేవీ జరుపుతారు. అది మనిష్టం. చాలారోజులులావాదేవీ జరపకపోతే అకౌంట్ మూసివేస్తారా!

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశంజిల్లా

ప్రాణాలు తీస్తున్న రోడ్లు

రాజేంద్రనగర్ బండ్లగుడాజాగీరు మున్సి పాలిటీపరిధిలో హెచ్.పి. పెట్రోల్ బంకు ట్రాఫిక్ సిగ్నల్ చౌరస్తా నుండి కిస్మత్పూర్ గ్రామం వరకు ఉన్న ఇరుకైన రోడ్డుపై ఆర్టీసీ బస్సులే కాకుండా అనేక రకాలవాహనాలు తిరుగుతున్నాయి. కిక్కిరిసినజనం,ఆరోడ్డుపై పోవాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసిందే. 100ఫీట్ రోడ్‌శాంక్షన్ అయిదశాబ్దాల గడిచిన కదలికలేకపోవడంతో సంబంధిత అధికారులపైనే గాకుండా ప్రజాప్రతినిధులపై ప్రజలలో అసంతృప్తి జ్వాల రగులుకుంటుంది.

-పి. సత్యనారాయణ, గంధంగూడ

పింఛనుదారులను నిరాశ పర్చిన ఈ.పీ.ఎఫ్‌వో!

గురువారం ఢిల్లీలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి అధ్వర్యంలో 240వ సీబీటీ సమావేశంలో ఈ.పీ.యస్ కనీస పింఛను పెంపు గురించి నిర్ణయం తీసుకొని ప్రస్తుతమున్న కనీస పింఛను వెయ్యి రూపాయలను రూ. 3 వేల రూపాయలకు పెంచుతారని, దేశవ్యాప్తంగా ఉన్న ఈ.పీ.ఎఫ్ వో పెన్షన్ దారులంతా ఎంతో ఆత్రుతగా ఎదురు చూసారు. కానీ కనీస పింఛను పెంపు గురించి అసలు ఏ ప్రకటన రాకపోవడంతో పెన్షన్‌దారులంతా ఎంతో నిరాశ చెందుతున్నారు. ఒక పక్క ఈపీఎఫ్‌వో సంస్థ వద్ద 13 శాతంతో వృద్ధి చెందుతున్న రూ. 11లక్షల కోట్లకార్పస్ ఉందనిపత్రికల్లో కథనాలు వస్తున్నాయి. నిత్యావసర వస్తువులధరలు నిరంతరంపెరుగుతున్నా, ప్రైవేటు రంగంలో దశాబ్దాలుగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వర్తించే ఈ.పీ.యస్ మినిమం పెన్షన్ మాత్రం పెరగడం లేదు. గత రెండు దశాబ్దాలుగా కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే వస్తున్నది. గౌరవ ప్రదంగా బతికేందుకు ఈ వెయ్యి రూపాయలు ఏ మూలకు సరిపోతాయి?

- దాసం వెంకటరెడ్డి,బెంగుళూరు

త్రిమూర్తుల నిర్ణయం

చైనాలో శాంతి చర్చలు అమెరికా డోనాల్డ్ ట్రంప్, రష్యా పుతిన్, చైనా జిన్‌పింగ్‌ల మధ్య జరిగాయి. వారు ముగ్గురు ముచ్చటగా తీసుకున్ననిర్ణయం ఏమంటేఆదేశాలు న్యూక్లియర్ యుద్ధాలు చేయమని ప్రతిన బూనాయి. అంటే శతృదేశాల మీద మాత్రం ఇతర భయంకరమైన యుద్ధ సామాగ్రిని వాడ తారనిఅర్థంవస్తోంది. దీనిమరో అర్థం ఉక్రెయిన్ మీద రష్యా, ఇరాన్ మీద అమెరికా, పాకిస్థాన్ లాంటి స్నేహ ఆయుధాల సరఫరా చేస్తూచైనా తమ కార్యక్ర

కష్టార్జితాన్ని కాపాడారు

థాంక్యూ మోడీజీ.. సిటిఐ అభినందనల లేఖ



న్యూఢిల్లీ, నవంబరు 22: బంగారం కొనుగోళ్ల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన సూచ నలను ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సిటిఐ) ప్రశంసించింది. బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఆయన విజ్ఞప్తితో దేశవ్యాప్తంగా లక్షల మంది జ్యువెలరీ వ్యాపారులు, చిన్న వర్తకులు, పెట్టుబడిదారులు భారీ ఆర్థిక నష్టాల నుంచి బయటపడ్డారని పేర్కొంది. ఆదివారం ప్రధాని మోదీకి ప్రశంసల లేఖ రాసింది. ఆయన సూచనలపై విమర్శలు వచ్చినప్పటికీ, ప్రస్తుతం బంగారం ధరలు తగ్గిన తర్వాత వ్యాపారుల గణనీయమైన ఆర్థిక నష్టాలను నివారించడంలో ఆయన విజ్ఞప్తి సహాయపడిందని పేర్కొంది. ప్రధాని బంగారం కొనుగోళ్లు తగ్గించాలని సూచించిన సమయంలో కిలో బంగారం ధర రూ.1.90 కోట్లుగా ఉండేది. ప్రస్తుతం అది రూ.1.25 కోట్లకు పడిపోయింది. ఒకవేళ వ్యాపారులు మోదీ సలహాను విస్మరించి ఆ సమయంలో బంగారం కొనుగోలు చేసి ఉంటే, ఇప్పుడు కేజీకి రూ.65 లక్షల చొప్పున నష్టాన్ని చవిచూసి ఉండేవారని సిటిఐ వివరించింది. లక్షలాది మంది నగల వ్యాపారులు అప్పుల్లో కూరుకుపోయి దివాలాతీసి ఉండేవారని తెలియజేసింది. దేశ వ్యాప్తంగా లక్షల మంది నగల వ్యాపారులు కొన్ని నెలలకు సరిపడా బంగారం నిల్వలను నిర్వహిస్తుంటారని, ధరలు అధికంగా ఉన్న సమయంలో భారీ పెట్టుబడులు పెట్టి నిల్వలు కొనుగోలు చేసి ఉంటే భారీ నష్టాలు ఏర్పడేవని పలువురు వ్యాపారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ధరలు తగ్గడంతో కోట్ల రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వచ్చేదన్నారు. మోదీజీ మమ్మల్ని కాపాడా రంటూ పలువురు వర్తకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

పలు రాష్ట్రాల్లో రక్తం చిందిన రోడ్లు

రాజస్థాన్‌లో దైవ దర్శనం చేసి వస్తుండగా కాటేసిన మృత్యువు

ఒకే కుటుంబంలోని 9 మంది అక్కడకక్కడే మృతి

వేర్వేరు ఘటనల్లో 25 మంది దుర్మరణం, పలువురికి గాయాలు



ముంబయి, నవంబరు 22: దేశంలోని మూడు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 25 మంది మృతి చెందారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. ముందుగా రాజస్థాన్‌ప్రమాదంలో 12మంది చనిపోయారు. దేవుడి దర్శనం కోసం బయలుదేరిన వాళ్లను మృత్యువు దారిలోనే కాటేసింది రాజస్థాన్‌లో జరిగిన రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఏకంగా 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ వరుస యాక్సిడెంట్లు తీవ్ర విషాదాన్ని నింపాయి. మొదటి ప్రమాదం రాజస్థాన్‌లోని కోటాఉదయ్‌పూర్ నేషనల్ హైవేపై చోటుచేసుకుంది. నతా పోలీస్ స్టేషన్ పరిధిలోని శంభూపుర గ్రామం దగ్గర రోడ్డు పక్కన ఆగి ఉన్న ఒక ట్రక్కును వేగంగా వచ్చిన క్రూజర్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నపిల్లలతో సహా ఒకే కుటుంబానికి చెందిన 9 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మహారాష్ట్రకు చెందిన ఈ కుటుంబం మొత్తం 16 మందితో కలిసి ఖాటు శ్యామ్ జీ ఆలయ దర్శనం ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరింది. అదే వాళ్ల చివరి దర్శనం అవుతుందని వాళ్లు అస్సలు ఊహించి ఉండరు. అర్ధరాత్రి సమయంలో క్రూజర్ నడుపుతున్న డ్రైవర్‌కు ఒక్కసారిగా నిద్రమత్తు రావడంతో వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆ వాహనం అదుపుతప్పి నేరుగా రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడగా, వారిని వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, మృతుల గుర్తింపు కోసం పోస్ట్‌మార్టం నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా కలెక్టర్ రాజేష్ జోషి వెల్లడించారు. ఇక అదే రాత్రి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో మరో ఘోర ప్రమాదం జరిగింది. గుజరాత్ నుంచి రామ్‌దేవ్రా పుణ్యక్షేత్రానికి వెళ్తున్న ఒకే కుటుంబానికి చెందిన వారు ప్రయా ణిస్తున్న కారు, ఒక ట్రావెల్ టెంపో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదం లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారందరినీ జోధ్‌పూర్‌లోని మథురదాస్ మాథుర్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. ఒకే రాత్రి జరిగిన ఈ రెండు దుర్ఘటనలు రెండు రాష్ట్రాల్లోని ఆయా కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి. గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కచ్ జిల్లాలో జరిగిన ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. భుజ్‌ఖావ్డా జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. కచ్ జిల్లాలోని వెకారియా రణ్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వచ్చిన ట్రైలర్ ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదం తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. అంతేకాకుండా పల్టీలు కొట్టడంతో వాహనం తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద తీవ్రత కారణంగా ఏడుగురు అక్కడికక్కడే మరణిం చినట్లు సమాచారం. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉండటంతో స్థానికంగా విషాదం నెలకొంది. ప్రమాదానికి గురైన వారిలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ ఆర్మీ జవాన్ కుటుంబ సభ్యులు, వారి బంధువులు ఉన్నట్లు తెలుస్తోంది. సదరు జవాన్ భుజ్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు సమా చారం. మృతుల పూర్తి వివరాలు, వారి పేర్లు, ప్రమాదానికి సంబంధించిన ఇతర అంశాలపై అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. పూర్తి వివరాలు వెల్లడికా వాల్సి ఉంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై కూడా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడి

బహ్రెయిన్‌లో క్షిపణులు, డ్రోన్లతో ముట్టడి

ఇరాన్, నవంబరు 22: పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలైన అల్ రిఫా, అవాలిలను లక్ష్యంగా చేసుకుని.. బాలిస్టిక్ కిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్టు ఐఆర్‌జిసి ప్రకటిం చింది. అమెరికా దురాక్రమణ, తమ గగనతలాన్ని పదేపదే ఉల్లంఘిస్తున్నందుకు ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్టు ఇరాన్ తెలిపింది. ఈ దాడి కార ణంగా ఒక పౌర పారిశ్రామిక కేంద్రం దెబ్బతిన్నట్టు బహ్రెయిన్ వెల్లడించింది. పలు డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని తెలిపింది. పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్టు పేర్కొంది.

దౌత్య చర్చలను ముమ్మరం చేయాలి..

యుద్ధాన్ని ముగించడానికి కొనసాగుతున్న దౌత్య ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు హర్మూజ్‌ను తెరవబోమని స్పష్టం చేశారు. మరోవైపు శాంతి చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ ప్రతినిధుల బృందం శనివారం టెహ్రాన్‌ను సందర్శించి, చర్చలు జరిపింది.

బీహార్‌లో నితీశ్ సేతుపై రాజకీయ రగడ



పాట్నా, నవంబర్ 22: బీహార్‌లో రాజకీయ వివాదం చెలరేగింది. గంగా నదిపై నిర్మించిన నితీశ్ సేతు వంతెన ప్రారంభోత్సవం తీవ్ర దుమారం రేపింది. ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్‌కు ఆహ్వానం అందలేదన్న కారణంతో ఆర్ జెడి కార్యకర్తలు వంతెనపై నిరసనకు దిగారు. వంతెన ప్రారంభించిన కాసేపటికే ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ చిత్రాలతో ఉన్న పోస్టర్లను చించివేశారు. అలాగే, బిజెపి జెండాలను కాళ్లతో తొక్కుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.4,280 కోట్ల వ్యయంతో నిర్మించిన నితీశ్ సేతు వంతెనను ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే తేజస్వీ యాదవ్‌కు ఆహ్వానం అందకపోవడంపై రాఘోపూర్ ప్రాంతానికి చెందిన ఆర్జేడీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వంలో ఆయన భాగస్వామిగా ఉన్నారని గుర్తుచేశారు. ఈ మేరకు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. తేజస్వీ యాదవ్‌కు మద్దతుగా పార్టీ జెండాలు పట్టుకుని వంతెనపై భారీ ర్యాలీ నిర్వ హించారు. లాలూ ప్రసాద్‌యాదవ్, తేజస్వీకి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ క్రమం లో ప్రధాని మోడి, ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ చిత్రాలతో ఉన్న బ్యానర్లను చించివేశారు. బిజెపి జెండాలనూ కాళ్లతో తొక్కారు. ఈ నిరసన సుమారు 40 నిమిషాల పాటు కొనసాగింది.

శాంతి భద్రతలకు విఘాతం...మీ తీర్పు పునఃసమీక్షించండి

దీపత్తూన్ కార్తిక దీపంపై తమిళనాడు ప్రభుత్వం అప్పీలు

మదురై,నవంబరు 22: మధురై జిల్లాలోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న వివాదాస్పద దీపత్తూన్ వద్ద కార్తీక దీపం వెలిగించడానికి అనుమతినిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని తీసుకుంది. మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 20న జారీ చేసిన ఉత్తర్వులను పునఃసమీక్షించాలని కోరుతూ తమిళనాడు రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఈనెల24న అక్కడ దీపోత్సవం నిర్వహించడానికి ఇచ్చిన అనుమతిని సమీక్షించాలని విజ్ఞప్తి చేసింది. దీపత్తూన్ వద్ద ఈ ఏడాదికి ఒక్కసారి మాత్రమే దీపాన్ని వెలిగిం చడానికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిద్వారా తిరు ప్పరంకుం డ్రంపై ఎలాంటి సంప్ర దాయ, మతపర, యాజమాన్య హక్కు లు ఏర్పడబోవని స్పష్టం చేసింది. భవి ష్యత్తులో దీనిని ఒక ఉదాహరణగా గానీ, ఆనవాయితీగా గానీ పరిగణిం చడానికి కూడా వీల్లేదని తన ఆదేశాలలో స్పష్టమైన నిబంధన విధించింది. ఈ నిబంధనల ప్రకారం దీపారాధన సమ యంలో వివాదాస్పద ప్రాంతంలోకి ఆల య ప్రతినిధులు, ప్రభుత్వ అధికారు లకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. సాధారణ భక్తులు గానీ, స్థానికులు గానీ వారితో వెళ్లడానికి అనుమతి ఉండదు. ఆ సమయంలో ఎలాంటి ఊరేగింపులు, ప్రదర్శనలు, ధర్నాలు, నినాదాలు చేయకూడదని సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. ఈ మొత్తం ప్రక్రియను సమన్వయం చేయడానికి మధురై జిల్లా కలెక్టర్‌ను నోడల్ ఆఫీసర్‌గా సుప్రీంకోర్టు నియమించింది. కొండపై కార్తీక దీపం ఎక్కడ వెలిగించాలనే అంశంపై ప్రధాన వివాదం నెలకొంది.

చెత్త లారీలో పారిశుధ్య కార్మికుడి మృతదేహం!

జార్ఖండ్‌లోని గిరిడి మున్సిపల్ కార్పొరేషన్‌లో అమానవీయ ఘటన

రాంచీ, నవంబరు 22: బతికున్నంత కాలం ఊరి చెత్తను శుభ్రం చేసిన ఓ పారిశుధ్య కార్మికుడికి మరణానంతరం కనీస గౌరవం దక్కలేదు. జార్ఖండ్‌లోని గిరిడి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పారిశుధ్య కార్మికుడి మృతదేహాన్ని ఏకంగా చెత్త లారీలో ఆస్పత్రికి తరలించిన అమానవీయ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన మూడు శవవాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అధికారులు ఈ దారుణా నికి ఒడిగట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పచంబా పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన సోనూ హాదీ (30) గిరిడి మున్సిపల్ కార్పొరేషన్‌లో రోజువారీ వేతనంపై పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన ప్రమాదవశాత్తూ ఒక చెరువులో మునిగి మరణించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆయన మృతదేహాన్ని గిరిడి సదర్ ఆస్పత్రికి తరలించేందుకు శవవాహనానికి బదులుగా మున్సిపల్ చెత్త లారీని ఉపయోగించారు. చెత్త లారీలో మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, కార్పొరేషన్ పరిపాలనా తీరుపై తీవ్ర స్థాయిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కమిషనర్ తీవ్ర నిరక్ష్యమే కారణం: మేయర్

ఈ ఘటనపై గిరిడి మేయర్ ప్రమీలా మెహ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మున్సిపల్ కమిషనర్ తీవ్ర నిరక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. 'కార్పొరేషన్ వద్ద మూడు శవవాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన జరగడందురదృష్టకరం. ఈ విషయం ముందే నా దృష్టికి వచ్చి ఉంటే ఇలా జరిగేది కాదు. మరణించిన ప్రతి వ్యక్తికి గౌరవ ప్రదమైన వీడ్కోలు పలకడం కమిషనర్‌తో సహా మనందరి ప్రాథమిక బాధ్యత' అని మేయర్ స్పష్టం చేశారు.

ఒక్కో ఎంపికి కోట్లు ఆఫర్ చేస్తున్న బిజెపి

డీలిమిటేషన్ బిల్లు కోసమే ఇదంతా.. ఎంపి సంజయ్‌రౌత్



ముంబయి, నవంబరు 22: పార్లమెంటులో ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన బిల్లు(డీలిమిటేషన్)కు మద్దతు కూడగట్టేందుకు ఎంపీలతో బీజేపీ భారీగా బేరసారాలకు దిగుతున్నదని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ ఆరోపించారు. ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన రౌత్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరచూ ముంబైకి రావడాన్ని ప్రశ్నించారు. డబ్బు తరలింపునకు ముంబై మార్గంగా మారిందని ఆయన అన్నారు. కేంద్ర హోంమంత్రికి ముంబైలో అసలు పని ఏమున్నది? ఎంపీలను ఆకర్షించే బాధ్యతను మహారాష్ట్ర, ముంబైలోని కొందరు కీలక నేతలకు అప్పగించారా? అని రౌత్ ప్రశ్నించారు. కొద్ది రోజుల కిందట ఒక ఎంపీ ధర రూ.100 కోట్లు ఉండగా, ఇప్పుడు అది రూ.150 కోట్లకు చేరిందని రౌత్ ఆరోపించారు. ప్రతిపక్షాల సంఖ్యా బలాన్ని తగ్గించేందుకు అధికార పార్టీ తన అధికారాన్ని వినియోగిస్తున్నదని ఆరోపించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీల ప్రకటనలో జాప్యంపై కేంద్ర ప్రభుత్వాన్ని రౌత్ ప్రశ్నించారు. సమావేశాల నిర్వహణకు ఇంత ఆలస్యం ఎందుకవుతున్నదని అడిగారు. ఎంపీలను తమవైపు తిప్పుకోవడానికి, ఆర్థిక లావాదేవీలకు వీలు కల్పించడానికి ప్రభుత్వం సమయం తీసుకుంటున్నదా అని ప్రశ్నించారు. ఎంపీల కొనుగోలు విక్రయాల ఆరోపణలను స్టాక్ మార్కెట్‌తో పోల్చారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో షేర్ల ధరలు ప్రదర్శించినట్టే, ఎంపీల కొనుగోలుకు దేశవ్యాప్త ధరలు ఇప్పుడు చెబుతున్నా అని అన్నారు. దేశంలో కొత్తగా రాజకీయ జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఏర్పడిందని రౌత్ అన్నారు.

అమెరికా తొలి అధ్యక్షుడి 3 వెంట్రుకలకు రూ.3.7 లక్షలు

వాషింగ్టన్,నవంబరు 22: అమెరికా తొలి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ వెంట్రుకలు భద్రపర్చిన లాకెట్ వేలంలో భారీ ధర పలికింది. కేవలం మూడు వెంట్రుకలు మాత్రమే ఉన్న ఆ లాకెట్ ఏకంగా 4,000 డాలర్లకు (మన కరెన్సీలో రూ.3.7 లక్షలకు) అమ్ముడుపోయింది. వాషింగ్టన్ మృతిచెందిన తర్వాతనో, మృతికి ముందుగానో అతడి మూడు వెంట్రుకలను ఆ లాకెట్‌లో భద్రపర్చినట్లు కుటుంబ వారసులు తెలిపారు. జార్జి వాషింగ్టన్‌కు సన్నిహిత వ్యక్తుల్లో ఒకరైన జాన్ గాడ్స్‌బై అనే వ్యక్తి 1799 లో వర్జినీయాలోని అలెగ్జాండ్రియా నగరంలో వాషింగ్టన్‌కు చివరి డిన్నర్ ఇచ్చారు. అదేఏడాది వాషింగ్టన్ కన్నుమూశారు. తాజాగా వేలం వేసిన లాకెట్ జాన్ గాడ్స్‌బై నుంచి ఆయన మనవరాలైన జులియా టెన్ మెక్ బ్లేయర్‌కు వచ్చినట్లు రిచ్‌మాండ్ ఆక్షన్ హౌస్ తెలిపింది. దాన్ని కొన్నేళ్లు ఆమె ఇంట్లోని వాషింగ్టన్ చిత్రం వద్ద వేలాడదీశారు. ఆ తర్వాత లాకెట్ పురాతన వస్తువులు సేకరించే జాన్ కె లాటిమర్ వద్దకు చేరింది. కాగా, తమకు ఇష్టమైన వారి వెంట్రుకలు సేకరించి లాకెట్ల వంటి వాటిల్లో ఉంచి ప్రదర్శించడం అమెరికాలో పాపులర్ ట్రెండ్. ఇది వాషింగ్టన్ కుటుంబంలో కూడా ఉందని మోంట్ వెర్నన్ వెబ్‌సైట్ వెల్లడించింది. 2021లో వాషింగ్టన్‌కు చెందిన ఇలాంటి లాకెట్ 40 వేల డాలర్లకు (రూ.37 లక్షలకు) అమ్ముడుపోయింది. వాషింగ్టన్ సంతకం చేసిన లేఖ ఏకంగా వేలంలో 1,09,800 డాలర్లు పలకడం విశేషం.

భారత్ నాగరికతపై పుతిన్ ఆశ్చర్యం

మాస్కో,నవంబరు 22: భారత ప్రాచీన నాగరికత, భాషా వైవిధ్యంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. దేశంలో ప్రాంతానికో భాష, ప్రత్యేకమైన మాండలికం, సాంస్కృతి గుర్తింపు ఉండటం అద్భుతమన్నారు. ప్రధాని మోడీతో ఇటీవల జరిగిన సంభాషణను ఆయన గుర్తు చేసుకున్నారు. భారతదేశంలో భాషల వైవిధ్యం తనను ఆశ్చర్య పరిచిందన్నారు. సెర్బియన్ చిత్ర దర్శకుడు ఎమిర్ కుస్తురికాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత జనాభా సుమారు 150 కోట్లు ఉంటుందని, అందులో దాదాపు 6 కోట్ల మంది ఒక ప్రధాన భాష మాట్లాడుతుండగా, మిగిలి నవారు వివిధ ప్రాంతీయ భాషల్ని ఉపయోగి స్తున్నారని, మోడీతో జరిగిన సంభాషణలో తాను తెలుసుకున్నట్లు ఆయన వివరించారు. భారీ జనాభా ఉన్న దేశంలో ఇన్ని భాషాలు, భాషా వైవిధ్యం ఉండటం నిజంగా ఆశ్చర్యకరమని పుతిన్ అన్నారు.భారత భాషా వైవిధ్యం తో పాటు దాని ప్రాచీన నాగరికతను కూడా పుతిన్ ప్రశంసించారు. భారత సాంస్కృతిక వైవిధ్యం ప్రత్యేకమైందని, ప్రధానితో మాట్లాడటం వల్ల భారత్ గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నానని వెల్లడించారు.

బిజెపి విమర్శలకు రాహుల్ కౌంటర్



న్యూఢిల్లీ,నవంబరు 22: తన తల్లి సోనియా గాంధీ రాసిన బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్ అనే పుస్తకం ఆవిష్కరణలో రాహుల్ చేసిన కామెంట్లపై బీజేపీ విమర్శలు చేయడంపట్ల రాహుల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్ధనారీశ్వరుడి ఫోటోను ఎక్స్‌లో షేర్ చేసి ఆర్ఎస్ఎస్ మరియు బీజేపీలకు కౌంటర్ ఇచ్చారు. భారతదేశ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై ఏమాత్రం అవగాహన లేని అనాగరికులు అంటూ మండిపడ్డారు. భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాల్లో తనకు ఎంత అవగాహన ఉందో చిత్రం చూస్తే అర్థమౌతుందని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మొరటుగా దురాశ, కులతత్వం, పురుష అహంకారంతో ప్రవర్తిస్తున్నాయని ఆరోపించారు. మన ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై వారికి ఏ మాత్రం అవగాహన లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎలిఫెంటా గుహలలోని అర్ధనారీశ్వర శిల్పం చిత్రాన్ని షేర్ చేశారు. ఆయన షేర్ చేసిన ఫోటోలో శివపార్వతులు ఇద్దరు కలిసి ఒకే రూపంగా ఉన్నారు. ఇక ఇటీవల రాహుల్ శివుని ఒడిలో పార్వతి కూర్చున్న ఫోటోను సైతం షేర్ చేశారు ఆ పోస్టుకు కొనసాగింపుగా ఇప్పుడు మరో ఫోటోను షేర్ చేశారు. ఇదిలా ఉంటే రాహుల్ గాంధీ బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్ అనే పుస్తకం ఆవిష్కరణలో తన తండ్రి ఒడిలో కూర్చు ని తన తల్లి అన్నం తినిపించేందని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

బిజెపి ఎమ్మెల్యే రేఖాపాత్రపై విషప్రయోగం?



కోల్‌కత్తా,నవంబరు 22: 2024లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సందేశ్‌ఖాలీ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రేఖా పాత్ర, ఈ ఏడాది ఎన్నికల్లో బీజేపీ తరుఫున ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెకు వెంటిలేషర్‌పై చికిత్స అందిస్తున్నారు. శనివారం ఆమె అస్వస్థతకు గురికావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి మెరుగుపడకపోవడంతో బసీర్‌హాట్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో కోల్‌కతాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బంగ్లాలో ఇళ్లకు నిప్పు



ఢాకా, నవంబరు 22: బంగ్లాదేశ్‌లో రాజకీయ హింస మళ్లీ తీవ్రరూపం దాల్చింది. దేశంలోని పలు ప్రాంతాలకు ఈ హింసాత్మక ఘటనలు విస్తరిస్తుండగా, నరైల్ జిల్లాలోని ఒక గ్రామంలో అవామీ లీగ్ నేతలు, కార్యకర్తల ఆస్తులే లక్ష్యంగా దాడులు జరిగాయి. దుండగులు దాదాపు 30 ఇళ్లకు నిప్పు పెట్టడంతో పాటు పలు ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేసి లూటీ చేసినట్లు స్థానిక మీడియా నివేదించింది. నరైల్ జిల్లా కలియా ఉపజిల్లాలోని బెందార్చార్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం మొదలైన ఈ దాడులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి.

బ్రేకుల్లేని వందే భారత్‌పై విచారణ



హాటియా, నవంబర్ 22: ఖాళీ వందే భారత్ రైలు బ్రేకులు లేకుండా 463 కిలోమీటర్లు ప్రయాణించిన ఘటనపై దక్షిణ తూర్పు రైల్వే జోన్ తాజాగా విచారణకు ఆదేశించింది. కోచ్ బ్రేకులు పనిచేయకుండా వెళ్లడాన్ని తప్పు పట్టింది. భారతీయ రైల్వేలో ప్రయాణికుల భద్రతపై ఆందోళన కలిగించే అంశంగా పేర్కొని దర్యాప్తు ప్రారంభించింది. అక్టోబర్ 24న ఝార్ఖండ్‌లోని హాతియా నుంచి ఉత్తరప్రదేశ్ వరకు ప్రయాణికులు లేని ఖాళీ వందే భారత్ ర్యాక్‌ను తరలించారు. కోచ్ బ్రేకులు సరిగా పనిచేయడం లేదని లోకో పైలట్లు పదేపదే హెచ్చరించినా... సంబంధిత సిబ్బంది వాటిని పట్టించుకోకుండా రైలు ప్రయాణానికి అనుమతించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కలెక్టర్‌కు టివికె ఎమ్మెల్యే అసభ్య సందేశాలు



చెన్నై,నవంబరు 22: తమిళనాడులో అధికార పార్టీ టీవీకే ఎమ్మెల్యే సీ అరుల్ విఘ్నేష్ కల్లకురిచి జిల్లా కలెక్టర్‌కు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించిన వ్యవహారంపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరి తీవ్రంగా స్పందించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టీవీకే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ వ్యవహారం "వర్క్ ప్లేస్ వేధింపుల్ల పరిధిలోకి రాదా? అని ఘాటుగా స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణల్ని ఎమ్మెల్యే ఖండించారు. ఈ అంశంపై ఆదివారం జస్టిస్ విక్టోరియా గౌరి స్పందిస్తూ కలెక్టర్ భర్త ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపిగా ఎన్నికైన ఆరునెలలకే గుండెపోటుతో మృతి



ముంబయి,నవంబరు 22: బీజేపీ రాజ్యసభ సభ్యుడు రాంరావ్ వడ్కుటే కన్నుమూశారు. గుండెపోటుతో మృతి చెందినట్లు సమాచారం. ఛాతిలో నొప్పితో బాధపడుతుండడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలోనే తుదిశ్వాస విడిచారు. రాంరావ్ వడ్కుటేను బీజేపీ 8 నెలల క్రితమే రాజ్యసభకు పంపించింది. మహారాష్ట్ర రాజకీయాల్లో అనుభవజ్ఞుడైన నాయకుడిగా, మంచి పేరున్న నేతగా ఆయనకు గుర్తింపు ఉంది.

పోలీసుల రిపోర్టుపై అసమ్మతి.. కారణాలు తప్పనిసరి

మేజిస్ట్రేట్‌కు సుప్రీం కోర్టు కీలక ఆదేశం



న్యూఢిల్లీ, నవంబరు 22: ఎటువంటి నేరం జరగలేదని పోలీసులు ఇచ్చిన నివేదికతో ఏకీభవించని పక్షంలో, ఆ నివేదికను ఎందుకు తిరస్కరిస్తున్నారో కారణాలను మేజ

కాంగ్రెస్ శ్రేణుల్లో అప్రమత్తత అవసరం

పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సమన్వయంతో కృషి చేయాలి

కేంద్రం రూ.30 వేల కోట్ల కరవు సాయం అందించాలి

కులగణనకు జనగణనలో ప్రత్యేక కాలమ్ చేర్చాలి

కాంగ్రెస్ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలు

గాంధీ భవన్‌లో మీడియాతో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క





హైదరాబాద్, నవంబరు 22,ప్రభాతవార్త: భారతీయ జనతాపార్టీ అప్రజాస్వామిక వైఖరి అనుసరిస్తోందని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాటం చేయాల్సి వస్తోందని ఈ దిశగా ప్రజలను చైతన్యంచేస్తూ కాంగ్రెస్‌కు వారి మద్దతు కూడగట్టుకునేందుకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు పూనుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, సీతక్కలు పిలుపు నిచ్చారు.తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అడ్వయిజరీ సమావేశం టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ అధ్యక్షతన జరుగగా తెలంగాణ నూతన ఇంచార్జ్ బి.ఎం. సందీప్, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర మంత్రులు, పిసిసి సభ్యుల సమక్షంలో సమావేశం తీసుకొన్న నిర్ణయాలను సమావేశం అనంతరం ఆదివారం గాంధీభవన్‌లో ఎఐసిసి కార్యదర్శులు ఆజ్మత్ హుస్సేన్, సంపత్ కుమార్‌లతో కలిసి మంత్రులు వివరించారు. బిజెపి ప్రజలను విద్వేషం, విభజించి అధికారంలోకి రావడానికి ఏదైనా చేస్తారని అమిత్ షా పర్యటన, కరీంనగర్‌లో బిజెపి జాతీయ అధ్యక్షుడి పర్యటనతో పాటు రాష్ట్రంలో ఇతర బిజెపి నేతల పర్యటనల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఓటర్ రివిజన్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణులు చర్యలు చేపట్టాలని పిఎసిలో తీర్మానించినట్లు చెప్పారు. పూర్వపు తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా పనిచేసిన మీనాక్షి నటరాజన్ సర్పంచ్, మున్సిపల్, ఉప ఎన్నికలు, ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషకృషి చేశారని, ఆమె ఇతర బాధ్యతల్లోకి వెళ్లిన నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్‌కు అందించిన సేవ లకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ఎల్‌నినో పరిస్థితులు, కరువు మండలాల ప్రకటన నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు రూపొందించిన ప్రణాళికల ప్రకారం దాదాపు రూ.30వేల కోట్ల నిధులు అవసరమవుతాయని తెలిపారు. తెలంగాణలో కరవు పరిస్థితులను జాతీయ విపత్తుగా పరిగణించి, రాష్ట్రానికి అన్ని విధాలా సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రధానమంత్రికి లేఖ రాయాలని పిఎసి సమావేశంలో తీర్మానం చేసినట్లు వెల్లడించారు.రాహుల్ గాంధీ సామాజిక న్యాయ పోరాటం, కాంగ్రెస్ పార్టీ నిరంతర డిమాండ్ నేపథ్యంలో 2027 జనగణనలో కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించినప్పటికీ, ఆగస్టు 14న విడుదల చేసిన 40 ప్రశ్నల నమూనాలో ఎస్సి, ఎస్‌టిలకు మాత్రమే అవకాశం కల్పించి ఒబిసి కాలమ్‌ను చేర్చకపోవడం పట్ల పిఎసి సమావేశం అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. జనగణనలో ఒబిసి కులగణనకు తప్పనిసరిగా ప్రత్యేక ఆప్షన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వంపార్టీ మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందించడం, ఇప్పటికే ఏర్పాటు చేసిన మండల, గ్రామ, పట్టణ, వార్డు కమిటీలను బలోపేతం చేయడం, అనుబంధ సంఘాలను పటిష్టపరచడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను గెలుచుకునేందుకు ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. డిసెంబర్ 7తో ప్రజా ప్రభుత్వం మూడేళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తూ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.ఢిల్లీలోని రాంలీలా మైదాన్ సభలో తెలంగాణ భాగస్వామ్యాన్ని, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ద్వారా రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని కాంగ్రెస్ నూతన ఇంచార్జ్ ప్రశంసించినట్లు తెలిపారు. త్వరలోనే నూతన ఇంచార్జ్ రాష్ట్ర నాయకులతో విడివిడిగా సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించనున్నారని, ఈసమావేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను పార్టీ త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు.



ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

ఆర్‌టిసి ఎండి డాక్టర్ అనిల్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త: సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రయాణీకులకు సౌకర్యవంతమైన సేవలు అందించటమే టీఎస్‌ఆర్టీసీ లక్ష్యమని ఆ సంస్థ ఎండీ డాక్టర్ అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. టీఎస్ ఆర్టీసీ, బీఎస్-6 బస్సులలో ఐ అలర్ట్ వ్యవస్థను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థగా దేశంలోనే రికార్డు సృష్టించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టెక్నాలజీ సమర్థవంతమైన వినియోగం ద్వారా టీఎస్‌ఆర్టీసీ ఇప్పటి వరకు సుమారు 36 కోట్ల విలువైన హైస్పీడ్ డీజిల్‌ను ఆదా చేసిందని, ప్రతి నెలా దాదాపు రెండు కోట్ల రూపాయలు ఆదా అవటమే కాకుండా, బస్సుల ఇంధన సామర్థ్యం మెరుగు పడిందని తెలిపారు. ఈ టెక్నాలజీ వినియోగం వల్ల సంవత్సరాలనికి 6,169.84 మెట్రిక్ టన్నుల సీఓ-2 వ్యర్థాలు తగ్గుతున్నాయని, దీనివల్ల పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించటంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఇంత మంచి సాంకేతికత ఐ అలర్ట్‌ను అడాప్ట్ చేసుకున్న టీజీఎస్ ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇతర విభాగాలు కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, సంస్థ సేవలను మరిత మెరుగుపరచాలని ఆయన సూచించారు.

పెట్టుబడులకు షార్జా రాజకుటుంబానికి ఆహ్వానం

గ్లోబల్ సమ్మిట్‌కు షేక్ సౌద్ అల్ ఖాసిమీని ఆహ్వానించిన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త: తెలంగాణలో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు విదేశీ పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రముఖులతో సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ యూఏఈలోని షార్జా, రాస్ అల్ ఖైమా రాజకుటుంబ సభ్యుడు షేక్ సౌద్ బిన్ ఫైసల్ బిన్ సుల్తాన్ అల్ ఖాసిమీతో సమావేశమయ్యారు. డిసెంబర్ 7నుంచి 9 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'కు హాజరుకా వాలని షేక్ సౌద్ అల్ ఖాసిమీతో పాటు ఇతర ప్రముఖులను మంత్రి ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, వివిధ రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అనుకూలతలను వారికి వివరించారు. ఈ సమావేశంలో యూఏఈకి చెందిన ఖలీద్ అల్ హోసాని, డాక్టర్ అహ్మద్ యూసుఫ్ అల్ అబ్ద్, టీపీసీసీ ప్రధాన కార్య దర్శి మహమ్మద్ అసదుద్దీన్ పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వ్యాపార సంస్థలకు పరిచయం చేయడంతో పాటు వివిధ రంగాల్లో భాగస్వామ్యాలు, నూతన వ్యాపార అవకాశాల కల్పనకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని అజారుద్దీన్ వివరించారు. తెలంగాణకు, యూఏఈకి మధ్య ఇప్పటికే ఉన్న స్నేహపూర్వక సంబంధాలను మరింత విస్తరిం చాలని, పరస్పర సహకారం, పెట్టుబడులు, వాణిజ్య సంబంధాల ద్వారా ఇరు ప్రాంతాల మధ్య బంధాలను బలోపేతం చేయాలని ఆకాంక్షి ంచారు. ఈ భేటీ తెలంగాణలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆర్ఎస్ఎస్ భావజాలంతో కుంటుపడుతున్న దేశాభివృద్ధి

రాష్ట్రంలో కరవును ఎదుర్కొనేందుకు సహకరించని కేంద్ర ప్రభుత్వం

తెలంగాణ ఇంచార్జి, ఎఐసిసి కార్యదర్శి బి.ఎం.సందీప్ కుమార్



ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సందీప్ కుమార్

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త: తిరోగమన బిజెపి, ఆర్ ఎస్ ఎస్ భావజాలంతో దేశాభివృద్ధి కుంటుపడుతోన్నదని ప్రజలను శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించేలా చైతన్యం చేస్తూ మనువాద భావాజాలాన్ని మనం తిప్పికొట్టాల్సిన అవసర ముందని తెలంగాణ ఇంచార్జి ఎఐసిసి కార్యదర్శి బి.ఎం సందీప్ కుమార్ అన్నారు. ఆదివారం పిఎసి సమావేశంలో గాంధీ భవన్ ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అంత కలిసికట్టుగా పని చేయడం వల్ల గత ఎన్నికల్లో 64 ఎమ్మెల్యే సీట్లతో అధికారంలోకి రాగలిగామన్నారు. తర్వాత జరిగిన అన్ని ఉప ఎన్నికల్లో విజయం సాధించామనీ అధికారంలోకి వచ్చిన మనం ఇక్కడ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తూ మహా అద్భుతమైన పాలన అందిస్తున్నామని వివరించారు. దేశంలో ఎల్ నినో వల్ల తీవ్రమైన కరవు ఏర్పడిందనీ ఆవేదన చెందారు. అయితే ఇక్కడ రాష్ట్రంలో ఉన్న కరవు పరిస్థితులు అధిగమిస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తగినంత సహాయ సహకారాలు అందించడం లేదన్నారు. వారు సహాయ నిరాకరణ చేసినా కూడా మనం కరవును ఎదుర్కొంటు రాష్ట్రంలో అన్ని రకాలుగా ప్రజల అవసరాలు తీరుస్తున్నామన్నారు.ఇప్పుడు మనం మరింత ఉత్సహంతో పని చేసి వచ్చే ఎన్నికల్లో ఎక్కువ మెజారిటీతో మరిన్ని అధిక స్థానాలు సంపాదించాలనీ చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనితీరు దేశానికి స్ఫూర్తిదాయకంగా ఉందనీ సంతృప్తిని వ్యక్తంచేశారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎఐసిసి ఇంచార్జ్‌లు పార్టీని బలోపేతం చేయడంలో చాలా కృషి చేసారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసేందుకు మరింత కష్టపడి పని చేయాలన్నారు.

సోనియాగాంధీ రాసిన బిలాం గింగ్ పుస్తకం దేశంలో చాలా ప్రాధాన్యత వచ్చిం దని అన్నారు.సోనియాగాంధీ చేసిన త్యాగాలు, ఇందిర, రాజీవ్ గాంధీ బలిదానాలు ఈ దేశంలో ప్రజల మనసులో ఉన్నాయనీ వాటిని ఉపయో గించి మనం అంత కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దేశంలో అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు.

ఉత్తమ్.. నన్ను దత్తత తీసుకొంటే పోతా

నవ్వుల్ ..నువ్వులు..

టిపిసిసి కార్యవర్గ సమావేశంలో మహేష్‌కుమార్ ఆహ్లాదకరంగా చర్చ



హైదరాబాద్, నవంబరు 22,ప్రభాతవార్త: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు తెప్పించాయి..టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ మాట్లాడుతూ మాది కుటుంబ పార్టీ కాదు నాకు గానీ, సిఎంకి గాని రాజకీయ వారసులు లేరు. మంత్రి ఉత్తమన్న కూడా వారసులు లేరు నాకు ఉత్తమన్న అంటే నాకు ప్రత్యేకమైన అభిమానమని ఆయన పార్టీ కోసం చాలా కష్టపడ్డారని ఆయనకు పిల్లలు లేరు రాజకీయాల్లోకి వచ్చేవారు ఎవరు లేరు ఇద్దరు ప్రజా సేవలో ఉన్నారు.. నన్ను దత్తసు తీసుకుంటే పోతాను అని అన్నారు..ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించి నాకు ఉన్న అప్పులకు దత్తతు రావాల్సి ఉంటాదని అన్నారు.. అందుకు స్పందనగా ఉత్తమన్న అప్పులకు కూడా దత్తత పోతా అంటూ మహేశ్‌కుమార్ అన్నారు. దాంతో సభలో పెద్దఎత్తున నవ్వుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ రోహిన్ రెడ్డి కూడా దత్తత కోసం చూస్తున్నాడని, సంపత్ కుమార్ కూడా అదే పనిలో ఉన్నారని అనడంతో సభలో నవ్వులు విరిసాయి.



పోలీసు బ్యాండ్లకు మళ్లీ పూర్వ వైభవం..

బ్రాస్, పైప్ బ్యాండ్ల బలోపేతానికి డిజిపి సివి ఆనంద్ నిర్ణయం

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త:తెలంగాణ పోలీసు శాఖలో బ్రాస్, పైప్ బ్యాండ్లకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు డీజీపీ సీవీ ఆనంద్ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పోలీసు బ్యాండ్లు కేవలం సంగీత ప్రదర్శనలకే పరి మితం కావని, క్రమశిక్షణ, ఐక్యత, బలగాల గుర్తింపు, గౌరవానికి ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. జాతీయ పర్వదినాలు, కవాతులు, గౌరవ వందనాలు, శాఖాపరమైన ముఖ్య కార్యక్రమాల్లో బ్యాండ్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. తెలంగాణ పోలీసు శాఖలో కొంతకాలంగా నిరక్ష్యానికి గురైన బ్యాండ్లలో సిబ్బంది సంఖ్య క్రమంగా తగ్గుతోంది. కేంద్ర బ్రాస్ బ్యాండ్‌లో 33 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 21 మందే ఉన్నారు. కేంద్ర పైప్ బ్యాండ్‌లోనూ పూర్తిస్థాయి సిబ్బంది లేరు. దీంతో పనిచేస్తున్న సిబ్బందిలో నిరుత్సాహం నెలకొనడంతో పాటు కొత్తగా ఈ విభాగాల్లో చేరేందుకు సిబ్బంది ఆసక్తి చూపడం లేదు. ఈపరిస్థితిని మార్చేందుకు బ్యాండ్లలో ఖాళీలను భర్తీ చేయడం, అవసరమైన ఆధునిక సంగీత పరికరాలను కొనుగోలు చేయడం, బ్యాండ్ సిబ్బందికి ప్రత్యేక అలవెన్సులు అందించడం వంటి చర్యలు చేపట్టనున్నారు.

బ్యాండ్‌లో సభ్యత్వం పొంద డాన్ని గౌరవప్రదమైన ప్రత్యేక బాధ్యతగా, ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దాలని డీజీపీ భావిస్తున్నారు. కేంద్ర బ్యాండ్లతో పాటు జిల్లా, బెటాలియన్ స్థాయి ల్లోనూ బ్యాండ్లను పునరుద్ధరించి బలోపేతం చేయనున్నారు.స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ వేడుకలతో పాటు పోలీసు శాఖ నిర్వహించే ముఖ్య కార్యక్రమాల్లో బ్యాండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వీటితోపాటు ప్రజల కోసం ప్రత్యేక సంగీత ప్రదర్శనలు నిర్వహించి పోలీసుశాఖకు, ప్రజలకు మధ్య మరింత అనుబంధాన్ని పెం పొందించనున్నారు.పోలీసు శాఖలోని గుర్రపు దళం (మోంటెడ్ బెటాలియన్) తరహాలోనే బ్యాండ్లకు కూడా పూర్వ వైభవం తీసుకొచ్చి, వాటిని బలగాల గౌరవ ప్రతీకలుగా నిలబెట్టడమే ఈ కార్యక్రమం లక్ష్యం అని తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త: నగరంలో మూడు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు చేశారు. మొత్తం 3.079 కేజీల సరుకును స్వాధీనం చేసుకున్నారు. కుత్బుల్లాపూర్‌లో 2.1 కేజీల గంజాయిని పట్టు కున్నారు. మహబూబ్ ఖాన్ వద్ద సరుకుతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. యూసుఫ్‌గూడలో 560 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. సయ్యద్ షాదాబ్ (20) వద్ద గంజాయి, యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు. మోలాలిలో 419 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. వరాల మహేందర్ (37) వద్ద గంజాయి, బైకును స్వాధీనం చేసుకున్నారు. మూడు కేసుల్లో నిందితులు, వాహనాలను సంబంధిత ఎక్సైజ్ స్టేషన్లకు పోలీసులు అప్పగించారు. రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, డీటీఎఫ్ బృందాల తనిఖీల్లో ఈ గంజాయిని పట్టుకున్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి: మంత్రి వాకిటి శ్రీహరి

పివి నరసింహారావు పశువైద్య వర్సిటీ 12వ వ్యవస్థాపక దినోత్సవం

ఆర్థికసంస్కరణలు దేశానికి కొత్త దిశ చూపాయి : జయప్రకాష్ నారాయణ్



ఆదివారం పివి నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎంపి, ఉపకులపతి ప్రొ. ఎం.జ్ఞాన ప్రకాష్ తదితరులు

అత్తాపూర్, నవంబరు22,ప్రభాతవార్త : పశుసంవర్ధక రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు శాస్త్రవేత్తలు అన్ని విధాలుగా తోడ్పాటునందించాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం 12వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం రాజేంద్రనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. ఎం. జ్ఞాన ప్రకాష్ వార్షిక నివేదికను సమర్పిస్తూ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 117 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, త్వరలో నియామకాలు చేపడతామని తెలిపారు. పశుసంపద, పాడి, కోళ్ల పెంపకం, మత్స్యరంగాల అభివృద్ధి ద్వారా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యమన్నారు.

లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్ ఎకానమీ, గవర్నెన్స్ అండ్ గ్రోత్ - అన్‌ఫినిష్డ్ అజెండా అంశంపై పీవీ స్మారక ఉపన్యాసం చేశారు. 1991లో పీవీ ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలు దేశానికి కొత్త దిశ చూపాయని, పాలన, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఇంకా సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ డా. జి. రంజిత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేయాలని, పశుసంవర్ధక రంగంలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు.

ఎన్ ఎఫ్‌డీబీ సీఈవో డా. బిజయ్ కుమార్ బెహెరా, నార్మ్ అదనపు సంచాలకులు డా. గోపాల్ లాల్, ముఖ్యమంత్రి ముఖ్య ప్రజాసంబంధాల అధికారి డా. జి. మల్సూర్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ ప్రొ. ఎం. ఉదయకుమార్, అసోసియేట్ డీన్ ప్రొ. డి. మాధురి, రిజిస్ట్రార్ ప్రొ. ఎ. శరత్ చంద్ర, అధ్యా పకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విజయాలను ఇంటింటికి చేర్చండి

రికార్డు వరి ఉత్పత్తికి ఆ ప్రాజెక్టులే ఆధారమని వెల్లడి

కాళేశ్వరం ఆశించిన ప్రయోజనం అందించలేదు

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం: మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 22 ప్రభాత వార్త: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను, సాధించిన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని నీటిపా రుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీకి పునాదులని అన్నారు.ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.సమావేశంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే సామాన్య కార్యకర్త కూడా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం కాంగ్రెస్‌లో ఉందన్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి నాయకులుగా తీర్చిదిద్దడం పార్టీ సంప్రదాయమని చెప్పారు. ప్రజలు తనను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నుకున్నారని గుర్తుచేసుకున్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీ, అర్హులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ ఆహార భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనాలని పేర్కొన్నారు.తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి, ఇతర పంటల ఉత్పత్తి నమోదవుతోందని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ప్రధాన కారణమని అన్నారు. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని చెప్పారు. భారీగా ఖర్చు చేసినప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం ఆశించిన ప్రయోజనం అందించడం లేదని విమర్శించారు. దాన్ని పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా చేయడానికి మరింత వ్యయం అవసరమవుతుందని, ఆ బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపైనే ఉందని అన్నారు.

ఎల్‌నినో పరిస్థితులు, నీటి లభ్యతపై ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. బోర్లు, చెరువులపై ఆధారపడిన కొన్ని ప్రాంతాల్లో వంటల సాగుకు ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. వచ్చే వర్షాకాలం వరకు తాగునీరు, ఇతర అత్యవసర అవసరాలకు నీటి కొరత రాకుండా, కరవు సంబంధిత ఇబ్బందులను తగ్గించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.ప్రభుత్వ పథకాలు, విజయాలను ప్రతి ఇంటికీ వివరించాలని, ప్రజలతో నిరంతరం అనుసంధానంలో ఉండాలని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను కోరారు. ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ కాంగ్రెస్ వారి మద్దతుతో తిరిగి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

రబీ, వేసవిలో విద్యుత్‌కు భారీగా డిమాండ్

రాష్ట్రంలో 21500 మెగావాట్లకు చేరుతుందని అంచనా

ఇప్పటికే 20018 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు

ముందస్తు చర్యలతో అప్రమత్తంగా ఉండాలన్న రాష్ట్ర సర్కార్

హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత యాసంగి సీజనుతో పాటు, వచ్చే వేసవి కాలంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటికే ఇటీవల రోజుకు 20018 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడిన దృష్ట్యా రానున్న రోజుల్లో ఇది మరింత భారీగా పెరిగే వీలుందని హెచ్చరించింది. రోజు వారీ విద్యుత్ వినియోగం 21500 మెగావాట్లకు చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మరోపక్క రాష్ట్రంలో విద్యుత్ కొరత కారణంగా రోజువారీగా పవర్ ఎక్స్చేంజీలో వానాకాలంలోనే 4 వేల మిలియన్ యూనిట్ల మేర రూ.2 వేల కోట్లకు పైగా వ్యయం చేసి విద్యుత్ పంపిణీ సంస్థలు కొనుగోలు చేసినట్లు పంపిణీ సంస్థల అధికారులు వెల్లడించారు..డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున వచ్చే వేసవిలో కనీసం 5 వేల మిలియన్ యూనిట్ల వరకైనా కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నాయి.ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ అమాంతం పెరగడంతో యూనిట్ సగటు ధర పవర్ ఎక్స్చేంజీల్లో రూ.7.30కి చేరింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి 6 నెలల్లో ఐఈఎక్స్ ద్వారా మొత్తం 77200 మిలియన్ యూనిట్ల విద్యుత్ క్రయవిక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 14.2 శాతం పెరుగుదల రికార్డైంది. ఈ ఏడాది ఒక్క సెప్టెంబరులోనే 12220 మిలియన్ యూనిట్ల విద్యుత్ క్రయవిక్రయాలు

ఆయిల్‌పామ్‌లో విద్యుత్ లైన్లకు పరిష్కారం

బహిరంగ లైన్ల స్థానంలో ఎబి కేబుల్స్: మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త: బహిరంగ విద్యుత్ తీగల స్థానంలో ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రతిపాదన చేశారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగులో రైతులకు అదనపు ఆదాయం సమకూర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల మధ్య నుంచి వెళ్తున్న బహిరంగ విద్యుత్ తీగల సమస్యకు శాశ్వత పరిష్కారం కింద వాటి స్థానంలో ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లి, రైతులకు ప్రయోజనం కలిగించేలా చర్యలు చేపట్టాలన్నారు. 2020-21 నాటికి సుమారు 46 వేల ఎకరాలకు పరిమితమైన ఆయిల్‌పామ్ సాగు గత నెలాఖరు నాటికి 92 వేల మందికి పైగా రైతులకు సంబంధించి 3.37 లక్షల ఎకరాలకు చేరుకుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్, తోటల నిర్వహణకు ప్రోత్సాహకాలతో పాటు గెలల సేకరణ, ప్రాసెసింగ్ సామర్థం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 2025-26 ఆయిల్ సంవత్సరంలో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సుమారు 4.74 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ గెలలను సేకరించి రైతులకు దాదాపు రూ.1,100 కోట్లు చెల్లించినట్లు వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. తోటల మధ్య నుంచి వెళ్తున్న 11 కేవీ, ఎల్‌టీ బహిరంగ విద్యుత్ లైన్లకు భద్రతా దూరాల నేపథ్యంలో ఎకరాకు 6 నుంచి 8 మొక్కల వరకు నాటలేని పరిస్థితి నెలకొంటోందన్నారు. దీంతో రైతులు తమ భూమిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడంతో పాటు, పంట జీవితకాలంలో పొందాల్సిన ఆదాయాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి లైన్లను పూర్తిగా పొలం సరిహద్దులకు మార్చాలంటే సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవడంతో పాటు కొత్త స్తంభాల ఏర్పాటు, భూ సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం ఉన్న స్తంభాలపైనే తగిన ప్రమాణాలతో ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయడం తక్కువ వ్యయంతో మెరుగైన ఫలితాలను అందిస్తుందని సూచించారు.

ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్‌లో జరిగిన చర్చలు తెలంగాణ అభివృద్ధికి దోహదం

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ముందస్తు సన్నాహక వేదికగా ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్: మంత్రి కోమటి రెడ్డి



హైదరాబాద్ నవంబరు 22,ప్రభాతవార్త: హైదరాబాద్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సు విజయవంతంగా ముగియడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.దేశ నలుమూల నుంచి 3,500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సు రహదారుల మౌళిక సదుపాయాలు, ఇంజినీరింగ్ ఆవిష్కరణలు,రోడ్డు భద్రత,సుస్థిర అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చించేందుకు గొప్ప వేదికగా నిలిచిందన్నారు.నాలుగు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో మొత్తం 19 సాంకేతిక సమావేశాలు నిర్వహించామని,నాణ్యమైన, సురక్షితమైన రహదారుల నిర్మాణంహైవే ఇంజినీరింగ్ లో నూతన ఆవిష్కరణలు,ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే రహదారుల నిర్మాణం,ఆధునిక పద్ధతులు,మల్టీమోడల్ ట్రాన్స్పోర్టేషన్వివిధ రవాణా వ్యవస్థల సమన్వయం,రహదారి భద్రతప్రమాదాల నివారణ, ప్రాణాల రక్షణ లాంటి పలు కీలకమైన అంశాలపై తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయని మంత్రి పేర్కొన్నారు.ఈ సదస్సులో జరిగిన చర్చలు, నిపుణుల సూచనలు, సాంకేతిక పరిజ్ఞానంపై జరిగిన మేధోమథనం తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాలు త్వరలో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ సమ్మిట్ గా నిర్వహించామని తెలిపారు.దేశ నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులకు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని, సంప్రదాయాలను, వంటకాలను పరిచయం చేయడంతో పాటు కళాకారుల ప్రదర్శనల ద్వారా మన సంస్కృతి, కళావైభవాన్ని చాటిచెప్పామని తెలిపారు.ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర రోడ్లు,రవాణా,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ,ఆర్ అండ్ బి సెక్రటరీ,ఆర్ అండ్ బి అధికారులు,పోలీస్,జీహెచ్ఎంసీ అధికారులు, కార్యక్రమం విజయవంతంలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు.నూతనంగా ఎన్నికైన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆదివారం హైదరాబాద్‌లో కోటిదీపోత్సవంలో పాల్గొన్న కంచిపీఠాధిపతి విజయేంద్ర సరస్వతి. చిత్రంలో బిజెపి ఎంపి లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

కన్నుల పండువగా కోటి దీపోత్సవం

తొమ్మిదవరోజు కార్యక్రమంలో పాల్గొన్న కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

హైదరాబాద్ (ముషీరాబాద్), నవంబరు 22, ప్రభాతవార్త: ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవం కన్నుల పండువగా కొనసాగుతోంది. తొమ్మిదవ రోజు ఆదివారం కావటంతో భక్తులతో, శివనామస్మరణతో కోటి దీపోత్సవ ప్రాంగణం మారుమ్రోగింది. మధుర మీనాక్షి, సుందరేశ్వరుల కళ్యాణోత్సవం కంచికామకోటి పీఠాధిపతి సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.నుమలత ముఖ్య అతిథులుగా హాజరై కంచి కామాక్ష అమ్మవారికి కోటి పసుపుకొమ్ముల అర్చన నిర్వహించారు. ఉజ్జయిని మహాకాళేశ్వరునికి భస్మహారతి, బంగారు శివలింగానికి 108 మంది భక్తులతో పంచహారతులు, మధుర మీనాక్షి, సుందరేశ్వరుల పల్లకీ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కంచికామకోటి పీఠాధిపతివిజయేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహభాషణం భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. స్వామీజీతో కలసి ముఖ్య అతిథులు కార్తీక దీపారాధన చేయగా, భక్తులు సామూహికంగా దీపారాధనలో పాల్గొన్నారు. సప్త హారతి, మహానీరాజనం, సాంస్కృతిక కార్యక్రమాలు, మహామంగళ హారతితో తొమ్మిదవ రోజు కోటి దీపోత్సవ కార్యక్రమం ముగిసింది.

ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా సి.బి.ఓజా

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త: భారత రహదారుల కాంగ్రెస్ (ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ - ఐఆర్‌సీ) 85వ వార్షిక సమావేశం ముగింపు సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 240వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సీ.బి. ఓజా, ఉపాధ్యక్షులు బి.ఎస్. బఘేల్, సి. రవి శేఖర్, ఆర్తి భార్గవ, సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తాతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. రాబోయే ఏడాది కాలానికి బాధ్యతలు చేపట్టిన నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. సమావేశంలో ఐఆర్‌సీ నూతన అధ్యక్షుడు సీ.బి. ఓజా మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక, ఇంజినీరింగ్, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా భారత రహదారుల కాంగ్రెస్ నిరంతరం అభివృద్ధి చెందాలని అన్నారు.

లక్ష్మీకాంతరావును మర్యాదపూర్వకంగా కలిసిన కెటిఆర్

హైదరాబాద్,నవంబరు22,ప్రభాతవార్త: హనుమకొండలో బిఆర్ఎస్ పార్టీ ఆదివారం నిర్వహించిన జన చైతన్య సభలో పాల్గొనేందుకు వెళ్లిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభ అనంతరం మాజీ ఎంపీ కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావును హంటర్ రోడ్డులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కొద్దిసేపు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్‌తో పాటు కెప్టెన్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. వారికి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్‌తో పాటు బిఆర్ఎస్ నేతలు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, మాజీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సహకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్ ఓటుకు కాదు.. చేటుకే

కేంద్రం చేపట్టే జనగణనలో ఒబిసి కులగణన చేర్చాలి ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ.30వేల కోట్ల సాయం చేయాలి కాంగ్రెస్ పిఏసి సమావేశంలో సిఎం రేవంత్



ఆదివారం గాంధీ భవన్‌లో జరిగిన పిఏసి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు22: ఎల్‌నినో వల్ల వర్షాలు పడటం లేదని, అందుకే తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రైతులకు మరోసారి సూచించారు. ఆదివారం గాంధీ భవన్‌లో పీఏసీ సమావేశంలో పాల్గొన్న ఆయన.. పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తలను వివరించారు.'ఎల్ నినో వల్ల వర్షాలు పడటం లేదు, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలి,రాష్ట్రం లో ఆహార ధాన్యాల కి కొరత లేదు,వర్షాకాలంలో 20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా రైతులకు అందించ గలిగాం, ఎల్‌నినో దృష్ట్యా ఎన్నో చర్యలు తీసుకున్నాం. పంటలు ఎండి పోకుండా కాపాడాం. దాదాపు 100 దేశాలు ఎల్‌నినో ప్రభావం వల్ల ఇబ్బంది పడుతున్నాయి. పక్కన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలో కరవు పరిస్థితులు ఉన్నాయి. వచ్చే 8 నెలలు తాగునీటికి కొరత ఏర్పడవచ్చు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జలాలను తాగునీటి కోసం వినియోగించాలని నిర్ణయించాం. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి రూ.30 వేల కోట్లు అవసరం. తెలంగాణకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం, పీఏసీ సమావేశంలో కూడా కేంద్రాన్ని కోరుతూ తీర్మానాల చేయాలి' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భారత దేశ మొట్టమొదటి ప్రధానమంత్రి నెహ్రూను సమావేశంలో రేవంత్ కొనియాడారు. 'తొలి ప్రధాని నెహ్రూ చొరవ వల్ల దేశంలో విద్య ప్రతి ఒక్కరికీ అందుతోంది. నెహ్రూ ప్రణాళికలతో ఇరిగేషన్ రంగమూ బాగా అభివృద్ధి చెందింది, ఆయన చొరవ వల్ల నే మిగులు ఆహార ధాన్యాలు ఉన్నాయి' అంటూ ముఖ్యమంత్రి ప్రశంసించారు. అనంతరం మీనాక్షీ నటరాజన్ నేతృత్వంలో తెలంగాణ కాంగ్రెస్ సాధించిన విజయాలను ఆయన వివరించారు. 100 ఏళ్ల తర్వాత మొదటి సారి తెలంగాణలో ఓబీసీ కులగణన నిర్వహించామని తెలిపారు. 2027లో కేంద్రం చేపట్టే జనగణనలో ఓబీసీ కులగణన చేయాలి,పిఏసి సమావేశం నుంచి తీర్మానం ద్వారా కేంద్రాన్ని కోరుతున్నామని, ప్రధాని నరేంద్రమోడీకి ఈ విషయం పైన లేఖ రాయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి సూచిస్తున్నట్లు ప్రకటించారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. 'సర్' విషయంలో ఆ పార్టీ తీరును తీవ్రంగా విమర్శించారు. 'గతంలో సర్ ప్రక్రియ ఓటు హక్కు కల్పించడం కోసం ఉండేది. దీన్ని మోదీ మొదటిసారి ఓట్ల తొలగింపునకు ఉపయోగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలందరికీ ఓటుహక్కు కల్పించింది. కానీ కేంద్రం ఈ హక్కును లాక్కుంటోంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అమెరికాలో మహిళలకు వోట్ హక్కు ఇవ్వడానికి 300 ఏళ్ళు పట్టింది. సరిపాలన ఎవరు చేయాలన్నది ప్రజలే నిర్ణయించాలని నెహ్రూ,మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆనాడు భావించారు. అందుకే ప్రజలందరికి ఓట్ హక్కు కల్పించారు.2019లో 130 కోట్ల జనాభా ఉంటే ఓట్లు 91 కోట్లు ఉన్నాయి.2024లో 140 కోట్ల జనాభా ఉంటే ఓట్లు 97.5 కోట్లు ఉన్నాయి అని చెప్పారు. కానీ ఇప్పుడు సర్ పేరుతో కనీసం 20 కోట్ల ఓట్లు తొలగించే అవకాశం ఉంది. 13 కోట్ల ఓట్లను ఇప్పటికే తీసేశారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మహిళల ఓట్లు తొలగిస్తున్నారు. వలసలు పోవడం వల్ల వీరి ఓట్లు తొలగిస్తున్నారు, ఈ వర్గాలు మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉన్నాయి. అలాగే తెలంగాణలో 71 లక్షల ఓట్లను పక్కన పెట్టారు అని చెప్పారు. 'కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటింటికి సరిగా లేకపోయినా ఓట్లను తొలగిస్తున్నారు. ఈ తొలగింపు ప్రక్రియ యాంత్రికంగా ఉంటోంది. బ్రిటిష్ హయాంలో సైమన్ కమిషన్‌లాగా మోదీ 'సర్' తీసుకువచ్చారు. సైమన్ కమిషన్ గోబ్యాక్ నినాదంలాగా ఇప్పుడు జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్ నినాదంతో ముందుకు రావాలి. ఓటుహక్కు లేనివాళ్లు, ఓటుహక్కు ఉన్నవాళ్లు.. ఇలా ప్రజలను రెండు రకాలుగా బీజేపీ విడదీస్తోంది. ఓట్ హక్కు లేని వాళ్ళు, ఓట్ హక్కు ఉన్న వాళ్ళు అన్న రెండు రకాల ప్రజలను బీజేపీ తయారు చేస్తుంది, దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులను ఆ పార్టీ తయారు చేస్తోంది' అని రేవంత్ ఆరోపించారు. 'సర్ పైన పూర్తి అప్రమత్తంగా ఉండాలి, ఎన్నికల వరకు వేచి చూడొద్దు అని సూచించారు. పీఏసీ సమావేశంలో ప్రజాబలం కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి చెప్పారు. సంక్రాంతి తరువాత ఇది మొదలవుతుందని తెలిపారు. దీన్ని 5 నెలల పాటు నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికీ నాయకులు వెళ్లాలని సూచనలు చేశారు. 'ప్రతి ఒక్కరికి పని కల్పిస్తాం..నిధులకు కొరత లేకుండా చూస్తాం, పార్టీలో పనిచేసిన వారికి అనేక మందికి పదవులు ఇచ్చాం'. అని చెప్పారు.నూతన ఇంచార్జ్ బీఎం సందీప్ కి తెలంగాణకు స్వాగతం,బిఎం సందీప్‌ను ఇం చార్జ్‌గా నియమించినందుకు సోనియా గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే,రాహుల్ గాంధీకి ఆయన ధన్య వాదాలు తెలిపారు.'మీనాక్షి నటరాజన్ ఇంచార్జ్‌గా ఉపఎన్నికలు,పంచాయత్,మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించాం,

66 శాతం పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాం, మునిసిపల్ ఎన్నికల్లో 85 శాతం విజయం సాధించాం,

మీనాక్షి నటరాజన్ సమయంలో మంచి విజయాలు సాధించాం' అని పేర్కొన్నారు. 'ప్రతి ఒక్కరికి పని కల్పించడమే లక్ష్యంగా త్వరలో పెద్ద కార్యక్రమం తీసుకుంటున్నాం, ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో పని చేసే వారి సంఖ్య బాగా పెరిగింది' అని చెప్పారు.

3 నెలల్లో క్వింటాల్‌కు రూ.2400కు పెరిగిన బియ్యం ధర

శ్వేత ఐరావతంలా సివిల్ సప్లయ్‌శాఖ సిండికేటు గజరాజులుగా బియ్యం వ్యాపారులు రూ.11000 క్వింటాల్ చొప్పున గజరాజు బ్రాండుతో హెచ్‌ఎంటి బియ్యం



హైదరబాద్,నవంబరు 22,ప్రభాతవార్త: బియ్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా.. అధికంగా ధరలు మూడునెలల్లోనే క్వింటాల్‌కు 2300 పెంచి దోచుకుంటున్నా ప్రభుత్వం చేష్టలుడిగి చోద్యం చూస్తున్నది.. బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో సామాన్య లకు ఆదుకునేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో నామ్‌కేవాస్తే తనిఖీలు చేస్తున్నప్పటికి బియ్యం వ్యాపారుల సిండికేటు పేచమణచడంలో విఫలమవుతుండటంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిపిఇ, బిపిటి బియ్యం రూ.66 నుంచి రూ.69లు, తెలంగాణ సోన రూ.74ల నుంచి రూ.76లకు, హెచ్‌ఎంటి రూ.79ల నుంచి రూ.81లు విక్రయించాల్సి ఉందని ప్రభుత్వ నిబంధనలున్నాయి. హెచ్‌ఎంటి బియ్యాన్ని గజరాజుగా, హెచ్‌ఎంటీ హంసలుగా పేరుపెట్టి కిలోకు రూ.88ల నుంచి రూ.110ల వరకు విక్రయిస్తున్నారు. 25కిలోల గజరాజు బియ్యానికి రూ.2,750లు, క్వింటాలకు రూ.11వేలకు విక్రయిస్తుండటంతో మధ్యతరగతి, ఎగువమధ్యతరగతి, ఉన్నత వర్గాలకు కూడా తీవ్ర ఇబ్బంది కలుగులోంది. బియ్యంతోపాటు నిత్యావసరాల ధరలు పెరుగుతుండటంతో గత మూడు నెలలో ప్రతి కుటుంబంలో భోజనం ఖర్చులు ఆరింతలు పెరిగి సామాన్యుడికి జీవితం భారంగా మారుతోన్నది. సివిల్ సప్లయ్‌శాఖ అధికారులు శ్వేత ఐరావతం వలే కదలక మెదలకపోవడంతో బియ్యం వ్యాపారులు సిండికేటు గజరాజులుగా క్వింటాల్‌కు రూ.11వేల ధరలు పెట్టి హెచ్‌ఎంటి బియ్యంను విక్రయించి ప్రజల ఆర్థిక వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు. తెలంగాణసోన రకం వినియోగదారులు జులైలో క్వింటాల్‌కు రూ.5400కు కొనుగోలు చేయగా ప్రస్తుతం దీని ధర రూ.7700కు చేరింది. వందకిలోల సన్న బియ్యం మూడు నెలల వ్యవధిలో రూ.2300 వరకు పెరిగింది. తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నప్పటికి రాష్ట్రరాజధాని హైదరాబాద్‌తోపాటు 33జిల్లా కేంద్రాలు ఇతర నగరాల్లో వినియోగదారులు జులైలో రూ.1,400కు కొనుగోలు చేసిన 26 కిలోల సన్న బియ్యం బస్తా, అక్టోబరుకు రూ.2,000కు చేరుకుంది. కేవలం మూడు నెలల వ్యవధిలో రూ.600 వరకు పెరిగింది. తెలంగాణలో బియ్యం బస్తాలు జిఎస్‌టి పన్ను మినహాయింపు కోసం26 కిలోలు విక్రయిస్తున్నారు. 25 కిలోలు లేదా అంతకంటే తక్కువ బరువుతో ప్యాక్ చేసి, లేబుల్ చేసిన బియ్యంపై 5 శాతం పన్ను వర్తిస్తుంది. 25 కిలోలు దాటితే పన్ను సున్నా రేటుతో ఉంటుంది. ఈ నియమం కారణంగా మిల్లులు ఒక కిలో అదనంగా నింపుతున్నారు. వినియోగదారులకు పన్ను భారం తగ్గుతుంది. హైదరాబాద్‌లో గత పక్షం రోజుల క్రితం సివిల్ సప్లయ్‌శాఖ, తూనికలు కొలతల అధికారులు తనిఖీచేయగా వ్యాపారులు 25 కిలోల బస్తాలకు 26 కిలోల లేబుల్ అంటించినట్లు వెల్లడైంది. వందకిలోల వడ్లు మిల్లు పట్టిస్తే 62నుంచి 67కిలోల వరకు మాత్రమే బియ్యం వస్తాయి అంటే ఒక కిలో బియ్యం పట్టిస్తే మనకు 650 గ్రాముల బియ్యం వస్తాయి. ఒక కిలో బియ్యం కోసం కిలోన్నర వడ్లు మర ఆడించాలి. 26 కిలోల బస్తాకు సుమారు 42 కిలోల వడ్లు కావాలి. పాత బియ్యానికే డిమాండ్ ఎక్కువ కాబట్టి, జులైలో విక్రయించిన బియ్యం గత పంట వడ్ల నుంచి వచ్చినవే. గత సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో బోనస్‌తో కలిపి క్వింటాల్ వడ్ల ధర రూ.2,900. ప్రైవేట్‌గా అమ్ముకున్న రైతులకు రూ.2,300 నుంచి రూ.2,600 వరకు లభించింది. రూ.2,600 ధరతో లెక్కిస్తే, మన బియ్యంలో కిలో వెనక రైతుకు రూ.45 దక్కింది. ఎకరాకు రూ.35,000 ఖర్చయితే, 22 క్వింటాళ్ల దిగుబడితో సొంత భూమి ఉన్న రైతుకు కిలోకి రూ.17 మిగులుతుంది. కౌలు రైతుకు మాత్రం కిలోపై కేవలం రూ.6 మాత్రమే మిగిలింది. 100 కిలోల వడ్లు మిల్లులోకి వెళ్తే, దాదాపు 58 కిలోల మంచి బియ్యం వస్తాయి. మిగిలిన 8 కిలోల నూకలు, 7 కిలోల తవుడు, 21 కిలోల ఉనుక మిల్లు విడిగా అమ్ముకుంటుంది. క్వింటాల్ వడ్ల మీద సుమారు రూ.400 అదనపు ఆదాయం మిల్లుకు వస్తుంది. అంటే కిలో బియ్యం మీద రూ.7. కరెంట్, కూలీలు, బస్తాల ఖర్చులు పోగా, పాత బియ్యం నిల్వ చేయాలంటే నెలల తరబడి వేచి ఉండాలి. దీనిపై నెలకి 2 వడ్డీ కూడా పెద్ద ఖర్చు. జులై నాటికి మిల్లుకు కిలోపై దాదాపు రూ.2 మాత్రమే లాభం మిగిలింది. మిల్లు నుంచి హైదరాబాద్‌లోని హోల్‌సేల్ గోదాములకు రవాణా ఖర్చులు, హమాలీ చార్జీలు కలిపి కిలోకి రూ.1.50లోపే. హోల్‌సేల్ వ్యాపారి మిల్లు రేటుపై కిలోకు ఒక రూపాయి లాభం, ఒక రూపాయి ఖర్చులు కలుపుతారు. రిటైల్ షాప్‌లో కూడా కొనుగోలు ధరపై కిలోకు సుమారు రూ.2 లాభం వేసి అమ్ముతారు. ఈ లెక్కన జులైలో కిలో రూ.54 ఉన్న బియ్యంలో రైతు వాటా రూ.45 కాగా, మిగిలిన రూ.9 మిల్లు, రవాణా, వ్యాపారులు, షాప్‌కు కలిపి వెళ్లాయి. అక్టోబరులో బస్తా ధర రూ.2,000కు చేరడంతో కిలో రూ.77 అయ్యింది. పెరిగిన రూ.23లో లారీ, హమాలీ, వ్యాపారుల వాటాలో పెద్దగా మార్పు లేదు. పెరుగుదల మొత్తం మిల్లు రేటులో ఉంది. జులైలో కిలో రూ.50 ఉన్న మిల్లు రేటు అక్టోబర్‌లో రకాన్ని బట్టి రూ.65 నుంచి రూ.85కి పెరిగింది. ఈ అక్టోబరులో మీరు కొన్న పాత బియ్యం గత పంట వడ్లతో తయారైనవే. చాలా మంది రైతులు పంట కోయగానే వడ్లను విక్రయించారు కాబట్టి, ఈ రూ.600 పెరుగుదలలో వారికి ఒక్క రూపాయి కూడా దక్కలేదు. ఈ పెరుగుదల నిల్వ ఎవరి దగ్గర ఉంటే వారికే దక్కింది – అది మిల్లులు, హోల్‌సేల్ వ్యాపారులు లేదా వడ్ల నిల్వ ఉంచుకోగలిగిన కొద్దిమంది రైతులకు మాత్రమే.

ప్రతికూల పరిస్థితుల్లోనూ పంట రుణాల వసూళ్లకు వేధింపులు

రైతులకు బ్యాంకర్ల జప్తు నోటీసులు రుణాల రెన్యువల్‌కై ఒత్తిళ్లు అన్నదాతలపై వడ్డీ భారం అమలుకాని వ్యవసాయ రుణాల మారటోరియం

హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త: రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం, మరికొన్ని చోట్ల తుఫాన్లతో పంటలు దెబ్బతిని రైతులు క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా, ఇదేఅదనుగా పంట రుణాల వసూళ్లకు బ్యాంకర్లు వత్తిడి తెస్తున్నారు. కరువు నేపథ్యంలో రాష్ట్రంలోని వ్యవసాయ రుణాలకు మారటోరియం అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా, బ్యాంకులు వాటి వసూళ్లకు కఠిన వైఖరి అవలంబిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో బ్యాంకుల రుణాలు చెల్లించాలంటూ నోటీసులు ఇస్తుండగా, మరికొన్ని జిల్లాల్లో వడ్డీ చెల్లించి రుణాలను రెన్యువల్ చేసుకోవాలని రైతులపై వత్తిడి తెస్తున్నట్లు తెలియ వచ్చింది. రుణాలు చెల్లించాలంటూ బ్యాంకు అధికారులు వేధిస్తుండటంతో కరువు కష్టాలో ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మారటోరియం అమల్లోకి వచ్చేలోగా అయినకాడికి వసూలు చేసుకుందామని భావిస్తున్న వివిధ బ్యాంకులు వెంటనే రుణాలు రెన్యువల్ చేసుకోమంటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తుండటంతో గత్యంతరం లేక పాత రుణాలకు వడ్డీలు చెల్లించి వాటిని రెన్యువల్ చేసుకోవాల్సి వస్తోంది. ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో పంట రుణాలకు సంబంధించి రీ షెడ్యూల్ చేయాల్సి ఉండగా, సహకార బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించాలంటూ వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. రుణాలు చెల్లించకపోతే తమ ఆస్తులను జప్తు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వరుసగా పంటలు నష్టపోయి అప్పులపాలయ్యామని, ఇలాంటి పరిస్థితుల్లో రుణాలు ఎలా చెల్లించాలంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సూర్యాపేట్ తదితర జిల్లాల్లో వడ్డీలు కట్టి రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పలు వాణిజ్య బ్యాంకులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి రుణాలు వసూలు చేసుకునే విషయంలో ముందు చూపుతో వ్యవహరిస్తున్నాయని పలువురు అంటున్నారు. మారటోరియం అమలుపై స్పష్టత లేకపోవడంతో రుణాల వసూళ్లకు వస్తున్నట్లు బ్యాంకు అధికారులు అంటున్నారని రైతులు అంటున్నారు. మారటోరియం సమయంలో రైతు రుణాలకు అయ్యే వడ్డీని చెల్లించే విషయంలో ప్రభుత్వం నుంచి స్పష


MARUTI SUZUKI ARENA
INTRODUCING
VICTORIS
AURUM EDITION
STRONG HYBRID
AURUM EDITION
WITH GOT IT ALL FEATURES
FRONT SKID PLATE
SIDE SKID PLATE
REAR SKID PLATE
SCAN AND CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT WWW.MARUTISUZUKI.COM
CONTACT US AT 1800-102-1800
*Applicable T&C available at the nearest authorized dealership. Creative visualization. Car colour may vary due to printing on paper. Images used are for illustration purposes only. Black glass shade visible on the vehicle glass is a result of lighting conditions and visual representation. Accessories may not form part of standard fitment, and vehicle features may vary as per variant.
VICTORIS

Printed and Published by GireeshSingh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-401, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036, Editor : *DameriaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.